తగ్గుతున్న గోదావరి

పోలవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి):పోలవరంలో బుధవారం నాటికి గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి అదనంగా వస్తున్న 6,14,833 క్యూసెక్కులను జలవనరుల శాఖ అధికారులు స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 30.650 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.660 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31.50 అడుగులకు చేరుకుంది.

పారిశ్రామికాభివృద్ధికి నూరుశాతం ప్రోత్సాహం

» కలెక్టర్ వెట్రిసెల్వి



స్టాల్ వద్ద కార్పెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి):వివిధ వస్తు ఉత్పత్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం వల్ల వినియోగదారుల సంతృప్తి బ్రాండ్ విధేయతను పెంపొందిస్తుందని, జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి నూరుశాతం ప్రోత్సాహన్ని అందిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలశాఖ, ఎఫ్ఎస్ఎంఈతో కలిసి భారతీయ నాణ్యత ప్రమాణాలు(బీఐఎస్) నిర్వహించిన వర్క్‌షాపును బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడుతూ పరిశ్రమల్లో నాణ్యతా, భద్రతా ప్రమాణాలను పాటించడం అవసరమని, బీఐఎస్ ప్రమాణాలను పాటిస్తే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఎఫ్ఎస్ఎంఈ జాతీయ అధ్యక్షుడు ఏవీకె రెడ్డి, బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సజనీ పట్నాల ఎఫ్ఎస్ఎంఈ కన్వీనర్ ఎం.వేణుగోపాల్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా పార్లమెంట్ సమావేశాల వల్ల హాజరు కాలేకపోయిన ఎంపీ పుట్టా మహేశ్ వర్చువల్‌గా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలమని, పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, భూములు ఇచ్చే విషయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పౌరసేవలపై ప్రజల్లో సంతృప్తి పెరగాలి

మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజలకు అందిస్తున్న పౌరసేవలపై సంతృప్తి స్థాయి పెంచేలా మునిసిపల్ కమిషనర్లు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, పీ-4 అమలుపై జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం నిర్వహించారు. ప్రతీరోజు చెత్త సేకరణ పక్కాగా జరిగేలా కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. అన్నక్యాంటీన్లను నిర్దేశించిన సమయంలో తెరిచేలా చూడాలని, ఆవరణలో పారిశుధ్యం పర్యవేక్షణ చేయాలని, ప్లేట్లను వేడినీళ్లతో శుభ్రం చేయాలన్నారు. పీ-4లో అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించాలని, వారికి చేయూతనిచ్చేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఏలూరు కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కలేనితనం!

రూ.60.43 కోట్లకు లెక్కా..పత్రాల్లేవ్


» దేవదాయశాఖలో ఆడిట్ అభ్యంతరాలు కోకొల్లలు
» ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే అభ్యంతరాలు
» సమీక్షలకు తీరిక లేని ఆ శాఖ అధికారులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ఏలూరులోని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం

దేవుడంటే భయపడాల్సిందీ పోయి, దేవదాయ శాఖలోనే ఈవోలు, కిందస్థాయి సిబ్బంది చేతివాటం, ఉత్సవాల పేరిట భారీగా నిధులు కైంకర్యం చేసేశారనే విమర్శలు విన్పిస్తున్నాయి. బడ్జెట్‌లో కేటాయింపులను మించి హారతి కర్పూరంలా వాడేసిన బాపతు కింద జిల్లాలో 144 దేవాలయాలు, సత్రాల పరిధిలో 16,843 ఆడిట్ అభ్యంతరాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. రూ.60.43 కోట్ల సొమ్ములపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో నూరు శాతం అవినీతి, అక్రమాలు జరిగాయడానికి లేదు. బడ్జెట్‌కు మించి ఉత్సవాలు, ప్రసాదాలు, ఇతర ఏర్పాట్లకు ఖర్చు చేయడం, ఆలయాలకు సంబంధించి మక్తాలు, కౌలు, లీజులు వ్యవహారాల్లో సకాలంలో వాటిని శాఖపరంగా జమ చేయకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే ఇందులో ర్యాటిఫికేషన్ పరిధిలోను సరిదిద్దుకునేవి ఉంటాయి. వాటి జోలికెళ్లడం లేదు సరికదా అసలు తామేమి చేశామో అన్న అంశంపై లెక్కలు సమర్పించి ఆడిట్ అభ్యంతరాలు సరిదిద్దుకోవాలని ఆడిట్‌శాఖ అధికారులు కోరుతున్న ఈ విషయంలో లెక్కలేనితనంగా ఈవోలు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 713కు పైబడి దేవాలయాలు, సత్రాలు ఉన్నాయి. వీటిల్లో 144 దేవాలయాలు, సత్రాల నుంచి ఆడిట్ అభ్యంతరాలు గత 30 ఏళ్ల నుంచి కొనసాగుతుండడం గమనార్హం.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు (ఫైల్)

దేవుడి ఆస్తుల కింద ఆలయాల అభివృద్ధి చేయాల్సిన సిబ్బంది, అధికారులే లెక్కలేనితనంగా వ్యవహరిస్తూ ఆదాయాలను హరిస్తున్నారు. ఇతర భూముల ద్వారా లీజులు వసూళ్లు, ఇతర చెల్లింపుల్లో ఆడిట్ అభ్యంతరాల్లో దేవదాయశాఖ బాధ్యతా రహిత్యంగా వ్యవహరిస్తోంది. ఈ శాఖలో ఏళ్లతరబడి ఆడిట్‌లు సక్రమంగా లేకపోవడంతో కోట్లాది రూపాయల దేవదాయం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సరిచేసుకుంటున్నది వేళ్ల పైనే..

జిల్లాలో ఓ మోస్తరు ఆదాయం వచ్చే ఆలయాలైన ద్వారకాతిరుమల, పట్టిసీమ వీరేశ్వర స్వామి దేవాలయం, జంక్షన్ (మిగతా 8వ పేజీలో)

నవంబరులోగా పరిష్కరించుకోవచ్చు

ఏటేటా ఆలయాల పరిధిలో ఆడిట్ అభ్యంతరాలు పెరిగిపోతున్నాయే తప్ప తరగడం లేదు. ఈ విషయంలో దేవాలయాలకు సంబంధించి ఏటా జూలై నుంచి నవంబరు వరకు నాలుగు నెలలు కాలం పైబడి ఇద్దరు సహాయ ఆడిట్ అధికారులు, జిల్లాలోని 20 మంది సీనియర్ ఆడిటర్లు పర్యవేక్షణలో ఆలయాల్లో ఆడిటింగ్ చేస్తుంటాం. ఈ నేపథ్యంలో ఆలయాలకు సంబంధించి వ్యక్తమైన అభ్యంతరాలను మీ వద్దకు వచ్చినప్పుడు పరిష్కరించుకోవాలి. ఈదిశగా ఈవోలు, సత్రాల సిబ్బంది శాఖపరంగా సహకరిస్తే వేగంగా అభ్యంతరాలు పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నాము.

\- ఏవీఆర్ గంగాధరరావు,
జిల్లా ఆడిట్ అధికారి



సర్పంచ్‌గా ఎన్నికైన కేవీఎస్ఎం నాయుడును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి, ఎంపీపీ కృష్ణ, వార్డు సభ్యులు

కైకలూరు తాత్కాలిక సర్పంచ్‌గా నాయుడు

కైకలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):కైకలూరు తాత్కాలిక సర్పంచ్‌గా 15వ వార్డు సభ్యుడు కొటికలపూడి వెంకట నరసింహమూర్తి నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత సర్పంచ్ డీఎం నవరత్నకుమారి ఎస్సీ రిజర్వేషన్‌తో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆమెను ఆరు నెలలపాటు తొలగిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. తాత్కాలిక సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 20 మంది వార్డు సభ్యులకు ఇద్దరు మృతి చెందారు. ఒకరు గైర్హాజరు కాగా 17 మంది హాజరయ్యారు. సభ్యులంతా సర్పంచ్‌గా నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కార్యదర్శి ప్రసాద్ ప్రకటించారు. ఆయనను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, వార్డు సభ్యులు పూలమాలలతో సత్కరించారు.

పెయ్యేరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ముదినేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి):పెయ్యేరు గ్రామ సర్పంచ్ ఎ.సుశీల చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో కె.అనూరాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలపై గ్రామానికి చెందిన కొందరు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీవో నిర్వహించిన విచారణ నివేదికల ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ చెక్ పవర్‌ను ఆరు నెలలపాటు రద్దు చేశారని ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో అశోక్ తెలిపారు. చెక్ పవర్‌ను ఎంపీడీవోకు అప్పగించారు. నిధుల దుర్వినియోగంపై పునర్విచారణ జరిపించాలని గ్రామానికి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు, అల్లా భక్షు, దూబా చంద్రకాంత్ చేసిన ఫిర్యాదులపై విచారణ పెండింగ్‌లోనే ఉంది.



మోదేలు కొండరెడ్లతో మాట్లాడుతున్న పీవో రాములు నాయక్

అడవిని ఖాళీ చేయం

» ఐటీడీఏ పీవోకు స్పష్టం చేసిన మోదేలు కొండరెడ్లు

బుట్టాయగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి):దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న మోదేలు కొండరెడ్డి గ్రామాన్ని కేఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ బుధవారం సందర్శించారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారిని ఇతర ప్రాంతానికి తరలించేందుకు పీవో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మోదేలు వెళ్లారు. అడవిని వదలి ఇతర ప్రాంతానికి రావాలంటే ఇక్కడ తమకున్న సదుపాయాలను కల్పించాలని, పోడు భూములు కావాలని తెలపగా ఇళ్లు తప్ప ఇతర సౌకర్యాలు కల్పించలేమని అధికారులు చెప్పడంతో ఇతర ప్రాంతానికి తరలి వచ్చేందుకు రావడానికి వారు అయిష్టత చూపించారు. కొండరెడ్లు తెలిపిన విషయాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లతామని పీవో తెలిపారు. ఏపీవో ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ కారం లక్ష్మీ, ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, కారం రాఘవ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు..నిండు ప్రాణం!

లోపలి పేజీలో..

అధికారుల తీరువల్లే భర్త చనిపోయాడని భార్య ఫిర్యాదు

రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

» రైతుల ఆందోళనపై అధికారుల స్పందన



రోడ్డు ఆక్రమణ పరిశీలిస్తున్న ఎస్ఐ, తహసీల్దార్, అధికారులు

చాట్రాయి, జూలై 30(ఆంధ్రజ్యోతి):చనుబండ శివారు సూరంపాలెంలో ఆక్రమణకు గురైన రోడ్డు వ్యవహారంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చేశారు. ఫలితంగా అధికారుల్లో కదలిక వచ్చింది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు ప్రారంభంలో ములగలపాటివారిపాలెంకు చెందిన పొద్దుటూరు రాములు కొంత భూమి ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్నాడని రెండు నెలల క్రితం రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమి చాట్రాయి, విస్సన్నపేట మండలాల్లో ఉండడంతో రెండు జిల్లాల కలెక్టర్లకు, పోలీస్, రెవెన్యూ ఆర్అండ్‌బీ అధికారులకు అర్జీలు సమర్పించినా స్పందించలేదు. దీంతో టీడీపీ నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో మంగళవారం రైతులు విజయవాడ-సత్తుపల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. బుధవారం విస్సన్నపేట తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, చాట్రాయి డీటీ ఈశ్వరరావు, ఎస్ఐలు డి.రామకృష్ణ, జి.రామకృష్ణ కదలివచ్చారు. తామంతా చందాలు వేసుకొని రూ.ఐదు లక్షలతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేసిన తర్వాత ఆక్రమించుకోవడంతో పొలాల్లోకి వెళ్లే దారి లేక భూములు సాగు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పొలాలకు వెళ్లే రోడ్డుకు అడ్డుగా కర్రలు పాతిన దృశ్యం

ఆగస్టు పింఛన్ల పంపిణీకి సర్వం సన్నద్ధం

» కొత్తగా 4,358 స్పౌజ్ పెన్షన్లు

ఏలూరు సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి):జిల్లాలో 2,61,592 మందికి ఎన్టీఆర్ భరోసా ఆగస్టు నెల పింఛన్లు రూ.114.25 కోట్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. బుధవారం సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అనివార్య కారణాల వల్ల ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ తీసుకోని వారికి ఆగస్టు 2వ తేదీన పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 5,303 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కాగా జిల్లాలో ఆగస్టు నెలలో స్పౌజ్ కేటగిరి (వితంతు పింఛన్‌లు) కొత్తగా 4,358 పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేసింద న్నారు. మండలాల వారీగా ఆగిరిపల్లి 200, భీమడోలు 152, బుట్టాయిగూడెం 107, చాట్రాయి 170, చింతల పూడి 160, చింతలపూడి అర్బన్ 39, దెందులూరు 151, ద్వారకా తిరుమల 161, ఏలూరు రూరల్ 87, ఏలూరు అర్బన్ 404, జంగారెడ్డిగూడెం 133, జంగారెడ్డిగూడెం అర్బన్ 80, జీలుగుమిల్లి 55, కైకలూరు 161, కలిదిండి 154, కామవరపుకోట 130, కొయ్యలగూడెం 180, కుక్కునూరు 86, లింగపాలెం 132, మండవల్లి 118, ముదినేపల్లి 148, ముసునూరు 136, నిడమర్రు 97, నూజివీడు 200, నూజివీడు అర్బన్ 88, పెదపాడు 147, పెదవేగి 194, పోలవరం 124, టి.నరసాపురం 104, ఉంగుటూరు 189, వేలేరుపాడు 71 మందికి కొత్తగా స్పౌజ్ కేటగిరీలో పింఛన్‌లు అందించనున్నారు.

ఒకటి నుంచి స్పౌజ్ పింఛన్లు : మంత్రి

ఏలూరు,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు నెల నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం కింద అదనంగా 1,09,155 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు అందచేస్తున్నట్లు గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలి పారు. వీరికి రూ.4వేలు చొప్పున పంపిణీ చేస్తామని, దీనికోసం ప్రభుత్వం రూ.43.66 కోట్లు అదనంగా ఖర్చు చేస్తోందన్నారు.

రుణాలు..తూచ్!

» వైసీపీ హయాంలో ఎస్సీ యువత నిర్వీర్యం
» స్వయం ఉపాధి ఊసేలేదు
» టీడీపీ ప్రభుత్వం రాకతో భరోసా
» ఉపాధి యూనిట్ల స్థాపనకు నోటిఫికేషన్
» వెల్లువెత్తిన దరఖాస్తులు



ఏలూరుటూటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో స్వయం ఉపాధి రుణాలు అందక ఎస్సీ యువత నిర్వీర్యం అయ్యింది. గతసారి టీడీపీ ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ కులాలకు స్వయం ఉపాధి రుణాలు అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో స్వయం ఉపాధి రుణాలను విస్మరించింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు మరల షెడ్యూల్ కులాలకు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకోవడానికి ద్వారాలు తెరిచింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,853 యూనిట్ల స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో ఏలూరు జిల్లాకు 1,111 పశ్చిమగోదావరి జిల్లాకు 742 యూనిట్లు స్థాపించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏలూరు జిల్లాకు 6,833, పశ్చిమగోదావరి జిల్లాకు 3,181 దరఖాస్తులు వచ్చాయి. ఏలూరు జిల్లాకు 46.44 కోట్ల రూపాయల యూనిట్లు స్థాపనకు కేటాయించారు. వీటిలో ప్రభుత్వ సబ్సిడీ రూ.18.35కోట్లు, బ్యాంకు రుణాలు రూ.25.77 కోట్లు లబ్ధిదారుని వాటాగా రూ.2.3 కోట్లు ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమ గోదావరి జిల్లాకు 742 యూనిట్లకు రూ.3.9 కోట్లు రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో రూ.12.22 కోట్లు సబ్సిడీ కాగా బ్యాంకు రుణాలు రూ.17.13 కోట్లు లబ్ధిదారుడి వాటాగా రూ.1.55 కోట్లుగా నిర్ణయించారు. ఇంకా ఇంటర్వ్యూలు జరుగుతాయనే సమయానికి ప్రభుత్వం రుణాలప్రక్రియ నిలుపుదల చేసింది. త్వరలో మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏప యూనిట్లకు రుణాలిస్తారు..

మూడు లక్షల లోపు రుణాలకు 60 శాతం సబ్సిడీ, బ్యాంకు రుణాలు 35 శాతం, లబ్ధిదారుడి వాటా 5 శాతం. ఈ కేటగిరిలో ఫ్లవర్‌బొకేల తయారీ, వర్మీకంపోస్టు యూనిట్, కంప్యూటర్ వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల తయారీ, వాటర్‌బాటిల్స్ రీసైక్లింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ సర్వీస్ యూనిట్లు స్థాపించుకోవచ్చు. రూ.మూడు లక్షలకు పైగా యూనిట్లు స్థాపించుకునేవారికి 40 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, లబ్ధిదారుడి వాటా 5శాతం. ఈ విభాగంలో మొబైల్ రిపేరింగ్, (మిగతా 8వ పేజీలో)



ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం

భీమవరం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి భీమవరం డీఎన్నార్ కళాశాలలో రామకృష్ణ భవన్లో ప్రదర్శించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నృత్య రూపకం ఆకట్టుకుంది. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రాసిన 'బుద్ధుడు ఆయన ధర్మం' పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడు సుందర్ రాజు నాటక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఉందన్నారు. బౌద్ధధర్మంలోని మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయోగమే బుద్ధునితో నా ప్రయాణం నాటకమని అన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ ట్రస్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిచర్ల హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనా జోసెఫ్ మాట్లాడుతూ ఈ నాటకం ఒక కళాత్మక ప్రదర్శన మాత్రమే కాదని మానవజాతికి మార్గదర్శకంగా నిలిచే ఒక ప్రయోగమన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈది రవికుమార్, జనరల్ సెక్రటరీ కొల్లి శ్రీనివాస్, గంట సుందర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మహేష్, వీరయ్య, శేకర్, కమలాకర్, సత్యవేణి, ఎస్తేర్ రాణి, తదితరులు పాల్గొన్నారు.



తన్మయ్, కోచ్ సాయిస్వరూప, హెచ్‌ఎం రాజేష్‌లను సత్కరించిన నాయకులు

జాతీయస్థాయి పోటీల్లో 'ప్రత్యేక' విద్యార్థిని ప్రతిభ

బోసు బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన పోస్టు బేసిక్ స్కూల్ విద్యార్థిని తన్మయ్

పెంటపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి బోసు బాల్ పోటీలలో పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలలో చదువుతున్న ప్రత్యేక విద్యార్థిని తన్మయ్‌శ్రీదేవి బంగారు పతకం సాధించింది. బుధవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థిని తన్మయ్ తో పాటూ కోచ్ సాయిస్వరూప, హెచ్‌ఎం రాజేష్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు. కోచ్ సాయిస్వరూప మాట్లాడుతూ చత్తీస్‌గఢ్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకూ నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రం నుంచి మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వీరిలో తన్మయ్‌శ్రీదేవి కూడా ఒకరన్నారు. జాతీయ స్థాయి వ్యక్తి గత విభాగంలో తన్మయ్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం సాధించిందన్నారు. విద్యార్థిని తల్లి సుగుణ మాట్లాడుతూ తన కూతురు ఇటువంటి విజయాన్ని సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మార్కెట్‌యార్డ్ డైరక్టర్ నల్లమిల్లి చినగోపిరెడ్డి, నల్లమిల్లి విజ యానందరెడ్డి, కొవ్వూరి విజయ భాస్కరరెడ్డి, కర్రి వరహాలరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెలగల శ్రీనివాసరెడ్డి, విద్యార్థిని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





తణుకు సజ్జాపురంలో రామకృష్ణ సేవా సమితి భవనం.. భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేదిక

ఆధునిక దేవాలయంగా తణుకు రామకృష్ణ సేవా సమితి

తణుకు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తణుకు సజ్జాపురంలోని రామకృష్ణ సేవా సమితి భవనం తణుకు పరిసర ప్రజలకు ఆధునిక దేవాలయంగా బాసిల్లుతోంది. ఆధ్యాత్మిక, సాహిత్య, సంగీత, సాంస్కృతిక, రంగాలకు వేదికగా వుండటంతో పాటు ఎంతో మంది కవులు, రచయితలు తమ కవిత్వాలను, పుస్తకాలను ప్రజలకు అంకితం చేసేందుకు రామకృష్ణ సేవా సమితి భవనం వేదికగా నిలుస్తున్నది. తణుకులో రామకృష్ణ సేవా సమితి ఏర్పాటు తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటిదిగా చెబుతారు.వాస్తవానికి రామకృష్ణ సేవా సమితి శాఖ మొదట విశాఖపట్టణంలోని బీచ్‌లో 1938 సంవత్సర కాలంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దానికి ఆర్‌కే బీచ్‌గా పిలవడం జరిగిందని చరిత్ర చెబుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో విశాఖ సముద్ర తీరంలో బాంబుల మోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న రామకృష్ణ సేవా సమితి సభ్యులు స్వామి నిశ్రేయానంద స్వామి ఆధ్వర్యంలో 1938లో తణుకు సజ్జాపురం ప్రాంతంలో రామకృష్ణ సేవా సమితి కార్యకాలపాలు ప్రారంభించారు. అనరంతరం 1990 దశకంలో ప్రట్టణ ప్రముఖుడు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, బోళ్ల బులిరామయ్య, డాక్టర్ తాతిని రామ బ్రహ్మం, మల్లిన రామచంద్రరావు, చిలుకూరి విశ్వేశ్వరరావు తదితరుల సహాయ, సహకారాలతో సజ్జాపురంలో ప్రత్యేక భవనం నిర్మించారు.రామకృష్ణ సేవా సమితి భవనంలో ప్రతీ రోజూ రామకృష్ణ పరమహంసం, శారదా దేవి, స్వామి వివేకానందుని విగ్రహాలకు ఉదయం సాయంత్రం హారతులు ఇస్తారు.

నిత్యం కార్యక్రమాలు

ప్రతీ రోజూ మల్లిన భద్రమ్మ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. అదే విధంగా నన్నయ్య భట్టారక పీఠం ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతీ ఉగాదికి కవి సమ్మేళనాలు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. రామకృష్ణ సేవా కేంద్రం, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సత్క రిస్తున్నారు. పట్టణంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రామబ్రహ్మం ఆధ్వర్యంలో ఐఎంఏ తణుకు శాఖ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించే వారు. ప్రస్తుతం ఉచిత హోమియో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. భవనంలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మహిళా గ్రంథాలయం ఏర్పాటైంది.

చివరి మజిలీ సాఫీగా సాగిపోవాలని కోరుకుంటారు.. గతంలో అంత్యక్రియలు జరిపేందుకు ఊరి చివర శ్మశానం ఉండేది.. చాలా గ్రామాల్లో వాటి నిర్వహణ సరిగా లేకపోవడం, అక్కడ సదుపాయాలు లేకపోవడం కారణంగా దూరమైనప్పటికీ అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి దహన సంస్కారాలు చేస్తున్నారు.. పెనుగొండ మండలం సిద్ధాంతం గోదావరి తీరంలో దహన కార్యక్రమాలు చేసేందుకు చుట్టుక్కల గ్రామాల నుంచి వస్తుంటారు..కానీ ఇక్కడ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి.. శవ దహనానికి వచ్చిన వారు నానా అవస్థలు పడుతున్నారు..



శివా..! చూసితివా !

దంపింగ్ యార్డుగా సిద్ధాంతం శ్మశాన వాటిక

దక్షిణ చినకాశీగా పేరు .. సదుపాయాలు కరువు..

స్నానాల రేవు అస్తవ్యస్తం.. అపరిశుభ్రం

అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెనుగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండ మండలం సిద్ధాంతం వశిష్ఠ గోదావరి నదీ తీరం దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రం. ఈ ప్రాంతంలో కేదారేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు జరుపుకొనుటకు ఇక్కడికే వస్తారు. ఈ ప్రాంతంలో ప్రతీ రోజూ నిత్యం 4 నుంచి 5 దహన సంస్కారాలు జరుగుతుంటాయి. దహన సంస్కారాలు చేసిన చితా భస్మాన్ని గోదావరిలో కలిపిన అనంతరం అదే ప్రాంతంలో మరొకరికి దహన సంస్కారాలు చేసే పరిస్థితి..



దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన రేవు దుస్థితి ఇదీ..

చెత్తతో నిండిపోతోంది !

సిద్ధాంతం పంచాయతీ గ్రామంలో సేకరించిన చెత్తను ఈ ప్రాంతంలోనే డంప్ చేయడంతో డంపింగ్‌యార్డ్‌గా మారిపోయింది. శ్మశానం పక్కనే చెత్త చెదారం ఉండటం వల్ల అంత్యక్రియలకు వచ్చిన జనం చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే వదిలి వేస్తే కనీసం ఇక్కడ దహనం చేసేందుకు జాగా కూడా మిగలదని పలువురు అంటున్నారు. శ్మశానికి వెళ్ళే రహదారి సైతం సరిగ్గా లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి కూడా శవాలను తీసుకువచ్చి ఇక్కడ అంత్యక్రియలు చేస్తుంటారు. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దహన సంస్కారాల కోసం వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి సరైన ప్రదేశం లేదు.. స్నానాలు చేయడానికి రేవు కూడా వీలుగా లేదు.. గత ప్రభుత్వ హయాంలో శ్మశాన వాటిక అభివృద్ధికి గత ఎమ్మెల్యే రూ.5 కోట్లతో పనులు ప్రారంభించి మధ్యలో నిలిపి వేశారు. వర్షం వస్తే దహన సంస్కరాలు పూర్తి కాక నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ శ్మశానం నిమిత్తం ప్రత్యేక స్థలాన్ని కేటాయించి అంత్యక్రియలు జరిగేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం..కాలాల్సిందే..

సిద్ధాంతం శ్మశానానికి పూర్వం నుంచి ఒక పేరు ఉంది. ఈ ప్రదేశంలో ఎపుడూ పొగ నిత్యం వస్తుంటుంది. దక్షిణ కాశీలో కూడా నిత్యం పొగ వస్తుందని అందుకే దక్షిణ చిన కాశీగా పిలుస్తుంటారు. చుట్టుపక్కల మండలాలు నుంచి కూడా ఇక్కడ పెద్ద సంఖ్యలో నిత్యం దహన సంస్కారాలు జరుగుతూనే ఉంటాయి. ప్రతీ రోజూ ఈ శ్మశానంలో కనీసం ఒక దహన సంస్కారం అయినా జరుగుతుంది. లేదంటే కనీసం తల వెంట్రుకలు అంటించి పొగ వచ్చేలా చేస్తారని చెబుతుంటారు. ఇటువంటి ప్రదేశంలో ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ ఎటువంటి అభివృద్ధి కూడా చేయలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అమ్మో ! జ్వరాలు



తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద క్యూలో బాధితులు

వణికిస్తున్న వైరల్ ఫీవర్లు

ఆసుపత్రులకు క్యూ కడుతున్న బాధితులు

ప్రతీ ఇంట్లో ఒకరో..ఇద్దరో పీడితులు

సీజనల్ అంటున్న వైద్యులు

తాడేపల్లిగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రస్తుతం వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటిలో చూసి ఒకరిద్దరు జ్వరాలతోనే బాధపడుతున్నారు. ప్రధానంగా వాతా వరణంలో వచ్చిన మార్పుల్లో భాగంగా ఈ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకులో ఒక జిల్లా ఆసుపత్రి ఉండగా తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 32 (పీహెచ్‌సీలు) ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 18 (యూపీహెచ్‌సీ) పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఏరియా ఆసుపత్రుల్లో ఓపీలలో రోజూ 350 నుంచి 400 మంది రోగులు వివిధ కారణాలతో వస్తున్నారు.వీటిలో 10 నుంచి 15 శాతం జ్వరాలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. జ్వరాల లక్షణాలతో ఆసుపత్రికి వీరంతా వస్తున్నారు. వీరికి ఏరియా ఆసుపత్రుల్లో రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే జ్వరాల ప్రభావంతో ప్లేట్‌లెట్లు పడిపోయిన ఘటనలు లేవు.జర్వాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వీరంతా ఆసుపత్రులకు క్యూ కడతున్నారు. కాళ్లు లాగడం, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇవి సాధారణ జ్వరాలేనని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రవిపాల్ చెబుతున్నారు. పదిరోజుల కిందట మూడు డెంగ్యూ కేసులు వచ్చాయని అవి పూర్తిగా నయం కావడంతో ఇంటికి వెళ్లిపోయారని తెలిపారు. ప్రస్తుతం టైఫాయిడ్ కేసులు రోజూ 3 నుంచి 4 వరకు వస్తున్నాయని చెప్పారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోల్చుకుంటే జ్వరాల తీవ్రత తక్కువేనని చెబుతున్నారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రజల్లో అవగాహన పెంచాల్సి ఉంది. దీనిలో భాగంగా గ్రామస్థాయిలో కూడా మెడికల్ సిబ్బంది జ్వరాల తీవ్రత గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తే దానికి అనుగుణంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారు. వైరల్ జ్వరాలైనా వాటికి అందించాల్సిన చికిత్సలు వేగవంతగా చేయడం ద్వారా వాటి తీవ్రతను తగ్గించవచ్చని వైద్యులు సూచి స్తున్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని చెబుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడం వల్ల దానికి అనుగుణంగా శరీరం తట్టుకోవడానికి కొంత సమయం పడుతుందని, ఆ సమయంలో తలనొప్పి, రొంప వంటి లక్షణాలు కనబడతాయని చెబుతున్నారు. దీన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకున్నా మంచిదేనని సూచిస్తున్నారు.

• ఇవి సీజనల్ జ్వరాలే



ఇప్పుడు వచ్చే జ్వరాలు సీజనల్ జ్వరాలే.. ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. జ్వర లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఏరియా ఆసుపత్రికి వస్తే పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యసేవలు మందులు అందిస్తాం. అన్ని జ్వరాలకు సంబంధించిన కిట్స్ అందుబాటులో ఉన్నాయి. ఏ జ్వరం లక్షణం కనిపించిన నేరుగా వైద్యులను సంప్రదించండి.

-డాక్టర్ రవిపాల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తాడేపల్లిగూడెం

• వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరికి అవసరం. ఇప్పుడు జ్వరాలు వాతావరణం మార్పు వల్ల వస్తు న్నాయి. తాగునీటి విష యంలో అశ్రద్ధ వల్ల జ్వరాలు ఎక్కువగా వస్తుంటాయి. కాచి చల్లార్చిన నీటిని తాగుతుంటే అసలు ఇబ్బందులు ఉండవు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మంచినీరు తాగడం వంటివి చేస్తే అసలు జ్వరాలు దరిచేరవు.

-డాక్టర్ కీర్తి , ఏరియా ఆసుపత్రి



నిర్మానుష్యంగా పాలకొల్లు-భీమవరం రోడ్డు

ఈ ఎండలతో జర జాగ్రత్త

పాలకొల్లు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల్లా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. అధిక ఎండలతో పాటు ఉక్కబోత, చెమటలతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఈ ఎండల వల్ల ఆరోగ్య ఇబ్బందులు ఎదురవుతాయని, జ్వరాలు కూడా వస్తున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులకు మంచి ఆహారం అందించాలి

డీఈవో వెంకట లక్ష్మమ్మ

కామవరపుకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : 'ఈ ఆహారం తినలేం' అనే వార్తా కథనంపై జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ స్పందించి మండలస్థాయి అధికారులకు, పాఠశాల ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. పాడైన బియ్యాన్ని వాడవద్దని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం సన్న బియ్యంతో తయారు చేయించి పెట్టాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తయారు చేసిన భోజనాన్ని హెచ్‌ఎం రుచి చూసిన తర్వాత పిల్లలకు వడ్డించాలన్నారు.

3న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆగస్టు 3వ తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉన్న వెయిట్ లిఫ్టింగ్ హాల్లో నిర్వహిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దిన్నాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పశ్చిమ గోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగా మార్పు చేసిన వెయిట్ కేటగిరీలతో నిర్వహిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లా మహిళా వెయిట్ లిఫ్టర్లు పోటీలలో పాల్గొనవలసినదిగా విజ్ఞప్తి చేశారు. 3న ఉదయం 7 గంటలకు వెయిట్ లిఫ్టర్లు, తమ వయస్సు ధృవీకరణ పత్రాలు, ఒరిజినల్స్‌తో హాజరు కావాలని కోరారు.

జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు గడువు పెంపు

పెదవేగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 2026-27 విద్యాసంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకొ నేందుకు గడువును ఆగస్టు 13వ వరకు పొడి గించినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ దాసరి పరశురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల రీత్యా, తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



ఏలూరు సత్రంపాడులోని లక్ష్మీ గణపతిస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వంకాయలతో అలంకరించారు. అర్చకులు రాఘవేంద్రశర్మ స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.


• కొత్తవారికి ఎంతో ఉపయోగం



హెచ్‌ఎంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మాలాంటి వారందరికీ ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పాఠశాలలో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలు, సవాళ్లను ఏవిధంగా అప్పటికప్పుడు పరిష్కరించే నైపుణ్యాలు ఈ శిక్షణలో నేర్చుకొన్నాం. బోధనతో పాటు పాఠశాల నిర్వహణ, సమాజ భాగస్వామ్యం, పాఠశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల, సమాజ భాగ స్వామ్యం పెంపొందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుంది.

ఎల్. శారద, హెచ్‌ఎం, జడ్పీ హైస్కూల్, పెనుమంట్ర

• తొలివిడతలో 220 మందికి



సాల్ట్ ప్రోగాంలో భాగంగా హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పశ్చిమ గోదావరి జిల్లాలో 12 మండలాల నుంచి తొలి దఫాగా 220 మందికి శిక్షణ ఇచ్చాం. రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్ పద్ధతిలో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి వివిధ నైపుణ్యాలలో శిక్షణ అందిస్తున్నాం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అందిచడమే ఈ శిక్షణా ముఖ్య ఉద్దేశ్యం.

-ఉంగరాల నాగేశ్వరరావు, కోర్సు కోఆర్డినేటర్, ఎంఈవో పెనుమంట్ర

నడిపించే నాయకుని కోసం..

నాయకత్వ లక్షణాలపై హెచ్‌ఎంలకు శిక్షణ..



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్

నిడమర్రు జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు మూల స్తంభాలైన ఉపాధ్యాయులను సమర్థులుగా తీర్చిదిద్దితే వారు పాఠశాలను సమర్థవంతంగా నడిపించగలరనే నమ్మకంతో రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయులకు దశల వారీగా లీడర్‌షిప్ ట్రైనింగ్ అందిస్తున్నది. దానికోసం జిల్లా కేంద్రంగా ఉపాధ్యాయులను ఎంపిక చేసి పాఠశాల బోధనకు అడ్డంకులు కలగకుండా దశలవారీగా రిసోర్స్‌పర్సన్‌ల ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నది. రెసిడెన్షియల్ విధానంలో నడిచే ఈ శిక్షణలో ఉపాధ్యాయులలో అంకితభావం, స్వీయ నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం వివిధ కృత్యాధార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నత, మోడల్ ప్రైమరీ, ప్రైమరీ స్కూల్ 540 ఉండగా హెచ్‌ఎంలందరికీ శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 220 మంది శిక్షణ తీసుకుంటున్నారు. రెండు రోజులుగా భీమవరం డీఎన్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాలలో మొదటి విడత శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. నేటితో ముగుస్తాయి. రెండో విడత ఆగస్టు 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్టు తెలిసింది.

పాఠశాల స్థాయిలో నాయకత్వ లక్షణాలు

విద్యావ్యవస్థ మూల స్తంభాలైన పాఠశాలలు బాగున్నప్పుడే మంచి ఫలితాలు పొందగలం. పాఠశాలను నడిపించే నాయకుడు సరైనవాడు ఉంటే ఆ పాఠశాల ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ఒకే విధమైన విద్యా ప్రణాళికలను రూపొందిస్తుంది. ఒకేరకమైన పాఠ్య పుస్తకాలు, వసతులు, నిధులు కూడా మంజూరు చేస్తూంటుంది.అయితే ఆ పాఠశాలకు చిత్తశుద్ధి, అంకితభావం గల ప్రధానోపాధ్యాయుడు ఉంటే ఆ విద్యాలయంలో ప్రభుత్వ విధానాలు ప్రకారమే నడుస్తుంది. నడిపించే నాయకుడుని బట్టే పురోగతి వృద్ధి చెందుతుంది.

శిక్షణలో బోధించే అంశాలు ఇవీ :

ఉపాధ్యాయుడి స్వీయ అవగాహన
ప్రధానోపాధ్యాయుడి సెల్ఫ్ మేనేజ్‌మెంట్
పాఠశాలలో అనుసరించాల్సిన అహింసాత్మక విధానాలు
ప్రభావవంతమైన నాయకత్వం...టీమ్ మేనేజ్‌మెంట్
పిల్లలను ప్రతిభావింతులుగా తీర్చిదిద్దడం
ఆర్థిక వనరులు సమర్థవంత నిర్వహణ
స్కూల్ డేటాబేస్ సేకరణ - నిర్వహణ

ద్వారకాతిరుమల సమాచారం

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 30వ తేదీ రాత్రి 8 గంటల సమయానికి ఖాళీ ఉన్న రూములు, కాటేజీల వివరాలిలా ఉన్నాయి.

రాణి చిన్నయమ్మారావు సదనం	27
టీటీడీ సత్రం	12
ధర్మ అప్పారాయ నిలయం	25
బాలాజీ సదనం	4
కాటేజీలు	29

రైల్వేస్టేషన్లలో అత్యవసర వైద్య సదుపాయాలు

ఎంపీ మహేశ్ ప్రశ్నకు మంత్రి స్పందన



ఏలూరు టూ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్స్‌లో అత్యవసర వైద్య సదుపాయాలు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. లోక్‌సభలో మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానాలిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రైళ్లు, రైల్వేస్టేషన్స్‌లో న్యూఢిల్లీ ఏఐఐఎంఎస్ నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రాణాపాయ సమయాల్లో ఉపయోగపడే మందులు, వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన మెడికల్ బాక్సులు అందుబాటులో ఉంచుతున్నట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడించారని తెలిపారు. స్టేషన్ మాస్టర్లు, సిబ్బందికి వైద్య సదుపాయాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతీ రైల్వేస్టేషన్స్‌లో సమీప ఆసుపత్రులు, వైద్యుల సమాచారం అందుబాటులో ఉంచామన్నారు. గాయపడిన ప్రయాణికులను తక్షణమే ఆసుపత్రులకు చేర్చేందుకు అంబులెన్స్‌లు వినియోగిస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు ఎంపీ మహేశ్ తెలిపారు.

కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపాలి

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ



సీఐ నుంచి కేసు వివరాలు తెలుసుకుంటున్న రాహుల్‌దేవ్

నరసాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల వెలుగు చూసిన నాన్‌డ్యూటీ, పెయిడ్, కల్తీ మద్యం కేసులపై రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ సీరియస్ అయ్యారు. ఇటువంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. బుధవారం ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు సర్కిల్‌లో ఇటీవల వెలుగు చూసిన నాన్‌డ్యూటీ పెయిడ్, కల్తీ మద్యం కేసుల వివరాలను సమీక్షించారు. నరసాపురంలో ఈ ఏడాది కొప్పర్రులో పట్టుకున్న నాన్ డ్యూటీ పెయిడ్ కేసులో మద్యం సరఫరా చేసిన వ్యక్తి భరత్‌రెడ్డిని ఇంకా ఎందుకు విచారించలేదని ఆరా తీశారు. పాలకొల్లు, భీమవరం, తణుకు సీఐలను కూడా ఆక్కడ పట్టుబడిన కేసులు, నిందితుల విచారణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, సారా, కల్తీ మద్యంపై నిఘా ఉంచాలన్నారు. పాత నిందితుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడే కేటుగాళ్లపై పీడీ చట్టం ఉపయోగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, అజయ్ కుమార్‌సింగ్, సీఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రా సుగర్స్ ప్రాంగణంలో అవగాహన కల్పిస్తున్న గెయిల్ అధికారులు

గ్యాస్ లైన్లు ఉన్న ప్రదేశంలో జాగ్రత్త అవసరం

తణుకు, జూలై 30(ఆంధ్రజ్యోతి):గ్యాస్ పైపులైన్లు ఉన్న ప్రదేశంలో పనులు చేపట్టే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గెయిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ నిలోయ్ ముఖర్జీ అన్నారు. బుధవారం రాజమండ్రి గెయిల్ ఇండియా లిమిటెడ్, కేజీ బేసిన్ ఆధ్వర్యంలో ఆంధ్రాసుగర్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ పైపులైన్లు ఉన్న ప్రదేశంలో పూడిక తీయడం, పొలాల్లో మట్టి తవ్వకాల సమయంలో, బోర్‌వెల్ వేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.అనంతరం అక్కమాంబ టెక్స్‌టైల్స్ కంపెనీలో గెయిల్ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. గెయిల్ జీఎం పోతయ్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు, బి.దావన్ మోహంతి, చీఫ్ మేనేజర్ విజయ్ బాస్కర్, ఆంధ్రా సుగర్స్ టెక్నికల్ అడ్వైజర్ రంగారావు, అక్కమాంబ మేనేజర్ సత్యనారాయణ, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

నరసాపురం రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైపీఎస్ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో నిర్వహించిన 'అంతరిక్ష సాంకేతిక-అనువర్తన అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.ఇంజనీరింగ్ చదివే విద్యా ర్థులు అంతరిక్ష రంగంలో ఎలా భాగస్వాములు కావాచ్చో విశ్లేషించారు. ఎంతోమంది ఇంజనీర్లు ఇస్రోలో చేరి పరిశోధనలు చేస్తున్నారన్నారు. అనం తరం శాస్త్రవేత్త దంపతుల్ని చైర్మన్ సత్యనారాయణ సత్కరించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ కుమార్, కిరణ్మయి, సురేష్‌కుమార్, గోపీచంద్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలకు నవోదయ స్కూళ్ల జట్ల ఎంపిక

దెందులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):క్రీడాకారులు గెలుపు ఓటమిలతో పని లేకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పరశురామ్ అన్నారు. బుధవారం పెదవేగి మండలం లక్ష్మీపురం జవహర్ నవోదయ పాఠశాలలో సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ పోటీలకు జట్ల ఎంపిక నిర్వహించారు. 80 జవహర్ నవోదయ పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెలలో హర్యానాలోని కురుక్షేత్రలో జరగనున్న పోటీలకు ప్రాతినిధ్య వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

యజమాని అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్



భీమవరంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి

- విద్యుత్ సమస్యలు రానివ్వద్దు
- కొత్త సబ్ స్టేషన్‌లకు ప్రతిపాదనలు పంపండి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

భీమవరంటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అధిక బిల్లులు వచ్చే ఇంటి యజమానులకు స్మార్ట్ మీటరు బిగించే విషయంలో సంబంధిత యజమాని అంగీకారం తీసుకుని ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. మంగళవారం రాత్రి భీమవరం వచ్చిన ఆయన విద్యుత్ శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో అధిక విద్యుత్ బిల్లులు వచ్చే వారు దాదాపు 25 వేల మంది ఉంటారని అధికారులు అంచనా వేశారు. వారికి స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయించారు. అయితే స్మార్ట్‌మీటర్లపై అపోహలు, ఆందోళనలు వస్తున్న నేపథ్యంలో యజమానులకు స్మార్ట్ మీటర్లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన తరువాత వారి అంగీకారం తీసుకుని బిగించాలన్నారు. సూర్యఘర్‌పై ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చెయ్యాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు వారి ఇళ్లపై అద్దెకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సర్వే త్వరతగతిన పూర్తి చెయ్యాలన్నారు.

విద్యుత్‌కు అంతరాయాలు రానివ్వద్దు..

జిల్లాలో ఎక్కడా విద్యుత్ అంతరాయాలు రాకుండా వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్ అందించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. పాలకొల్లులో 220 కేవీ సబ్ స్టేషన్ అవసరమని ఎస్ఈ రఘునాథబాబు వివరించారు. తరచూ అక్కడ లోడ్ ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ అంతరాయం వస్తోందని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, మంత్రి దృష్టికి తీసుకు రాగా ఈ విషయంపై ఎనర్జీ సెక్రటరీ విజయానంద్‌తో మాట్లాడతానని అన్నారు. అలాగే పెనుగొండ 130 కేవీ సబ్ స్టేషన్‌పై లోడ్ ఎక్కువగా ఉన్నందున విద్యుత్ అంతరాయాలు వస్తున్నాయని, లోడు భారం తగ్గించే విధంగా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు.

సబ్ స్టేషన్‌లకు ప్రతిపాదనలను పంపండి

జిల్లాలో ఎక్కడైనా సబ్ స్టేషన్‌ల నిర్మాణాలపై ప్రతిపాదనలు ఉంటే వెంటనే అంచనాలు వేసి పంపించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. దీనిపై అధికారులు నరసాపురం పరిధిలో వేములదీవి, అత్తిలి పరిధిలో మంచిలి, పాలకొల్లులో మేడపాడు, కాళ్ల పరిధిలో కానాలపల్లిలో ప్రతిపాదనలు ఉన్నాయని సంబంధిత ప్రజా ప్రతినిధులు పంపించారని వివరించారు. ఆకివీడు పరిధిలో పెద కాపవరం, భీమవరం మండలం లో సరిలో సబ్ స్టేషన్‌లు నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఈఈలు ఎన్.వెంకటేశ్వరారవు, కె. నరసింహమూర్తి, డిప్యూటీ ఈఈ కె. రాంబాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్



నూజివీడు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్‌ల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఒంగోలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మిగిలిన సీట్లకు భర్తీ చేసేందుకు మొత్తం 597 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించగా కౌన్సెలింగ్‌కు 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాక్ ఆడిటోరియంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో మొత్తం 123 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా వీరిలో బాలురు 38 మంది, బాలికలు 85 మంది ఉన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్

నూజివీడు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగిసింది. యునైటెడ్ వే అనే సంస్థతో కలిసి కెరియర్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ సెల్ గత పదిరోజులుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ట్రిపుల్ ఐటీలో చివరి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లకు కావలసిన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆప్టిట్యూడ్ రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ చిరంజీవి, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి రుద్రం నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు శిక్షణ అందించిన యునైటెడ్‌వే సంస్థ ప్రతినిధి సౌమ్యను అమరేంద్రకుమార్ సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లానాయకులు

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

2న కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఫ్యాప్టో నిర్ణయం

ఏలూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని బుధవారం సాయంత్రం ఏలూరులో జరిగిన సమావేశంలో తీర్మానించారు. వివరాలను ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మీడియాకు తెలియజేశారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పదవీకాలం పూర్తికాని స్కూల్ గేమ్స్ సెక్రటరీలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునః ప్రారంభించాలని, ఎంఈవోలు, గ్రేడ్-2 హెచ్‌ఎంలకు పరస్పర బదిలీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో టీచర్లు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాశ్‌రావు, రవికుమార్, పవన్‌కుమార్, కాంతారావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లకు నిరసనగా వామపక్షాల నాయకుల ధర్నా

స్మార్ట్ మీటర్లు వద్దు

ఏలూరు కార్పొరేషన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసన వ్యక్తం చేస్తూ నగరంలో పలుచోట్ల వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే ఆనాడు మంత్రి లోకేశ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే బద్దలు కొట్టండని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు పెంచవద్దని డిమాండ్ చేశారు. వామపక్షాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణచైతన్య, రెడ్డి శ్రీనివాస డాంగే, పి.కిషోర్, రవి, బద్దా వెంకట్రావు, డీఎన్‌వీడీ ప్రసాద్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఈవో-1 వెకెన్సీల భర్తీ విధానంపై అభ్యంతరాలు

ఏలూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి):మండల వ్యవస్థలో ఏర్పాటైన మండల విద్యాధికారుల (ఎంఈవో-1) పోస్టులను ఎఫ్ఏసీ పద్ధతిన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేయడంపై ఎంఈవో సంఘాలు మండిపడ్డాయి. ఉన్నతాధికారుల ఆదేశాలను ఖండించాయి. ఆ మేరకు బుధవారం వేర్వేరు ప్రకటనలను విడుదల చేశాయి. జీవో 154 ఉత్తర్వుల ప్రకారం ఎంఈవో-1 పోస్టులు కేవలం 13 మాత్రమే ప్రభుత్వ యాజమాన్యానికి వర్తిస్తాయని ఎంఈవో-2ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ రామకృష్ణ వివరించారు. దీనికి భిన్నంగా మొత్తం 666 పోస్టులను ఎంఈవో-1 కేటగిరీ పోస్టులుగానే పరిగణిస్తూ, వాటి భర్తీకి పంచాయతీరాజ్ యాజమాన్యంలోని సీనియర్ హెచ్‌ఎంలను పరిగణనలోకి తీసుకోకుండా సర్వీసులో ఎంతో జూనియర్లయినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లతో ఎఫ్ఏసీ/ఇన్‌చార్జి ప్రాతిపదికన భర్తీ చేసేందుకు సంబంధిత ఉపాధ్యాయుల అభీష్టాన్ని ఈ నెల 30లోగా తీసుకుని డైరెక్టరేట్‌కు పంపాలని ఆదేశాలివ్వడం పీఆర్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడమేనని ఆరోపించారు. విద్యాశాఖ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, తదుపరి కార్యాచరణను చేపడతామని తెలిపారు.

హైకోర్టు తీర్పులకు వ్యతిరేకం..

గత ఏడాది ప్రభుత్వం భర్తీ చేసిన ఎంఈవో-1 పోస్టుల్లో 13 మాత్రమే గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ వారికిచ్చి, మిగతావన్నీ జీవోలు 72, 73, 74 ప్రకారం పంచాయతీరాజ్‌కు చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులనే ఎంఈవో-1లుగా నియమించారని, ఈ నియమాన్ని ఉల్లంఘిస్తూ ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని ఏపీ ఎంఈవోల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి వివరించారు. అధికారుల నిర్ణయం అన్ని జీవోలకు, హైకోర్టు తీర్పులకు పూర్తి వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల రిటైరైన ఎంఈవో-1 ఖాళీలన్నీ పంచాయతీరాజ్ గెజిటెడ్ హెచ్‌ఎంలవేనని, వాటిని కూడా గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ వారితో భర్తీ చేయడం అత్యంత అశాస్త్రీయమని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులతోనే ఎంఈవో-1 వెకెన్సీలన్నింటినీ భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

జ్యూవెలరీ వర్క్ దుకాణంలో చోరీ

ద్వారకాతిరుమల, జూలై 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలోని ఓ జ్యూవెలరీ వర్క్‌దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తిమ్మాపురానికి చెందిన వి.హనుమంతరావు ద్వారకాతిరుమలలో శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి జ్యూవెలరీ వర్క్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో యథావిధిగా మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం వచ్చి పరిశీలించగా షాపు తాళాలు పగలకొట్టి ఉన్నాయి.గుర్తు తెలియని వ్యక్తులు లోనికి చొరబడి 4 గ్రాముల బంగారం, పావుకేజీ వెండి, రూ.2 వేలు నగదు తస్కరించినట్లు హనుమంతరావు పేర్కొన్నారు. ఈక్రమంలో ఆయన ద్వారకాతిరుమల పోలీసులకు ఫిర్యాదు చేయగా వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

నలుగురు నకిలీ ఎక్సైజ్ పోలీసుల అరెస్టు

అత్తిలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పోలీసుల పేరుతో సామాన్యులను బెదిరిస్తూ డబ్బు వసూలు చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్న దొంగ నాగ వెంకట అశోక్ వద్దకు ఎక్సైజ్ పోలీసులమని చెప్పి నలుగురు వచ్చి రూ.2000 బలవంతంగా వసూలు చేసుకుని పోయినట్టు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజ్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఒక కారులో నలుగురు వచ్చి ఎక్సైజ్ పోలీసులమని నమ్మబలికి సెల్ ఫోన్‌లో పోలీస్ యూనిఫాం ఫొటోలు చూపించి గుట్కా,మందు అమ్ము తున్నారని బెదిరస్తూ రెండు వేల రూపాయలు వసూలు చేసుకుని వెళ్లారని తెలిపారు. వారి ప్రవర్తపై అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తక్షణమే స్పందించిన పోలీసులు మంచిలి రోడ్డులో కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురిలో ముగ్గురు ఎన్టీఆర్ జిల్లా జగయ్యపేట కాగా, ఒకరిది కృష్ణా జిల్లా కృత్తివెన్ను గ్రామం అని గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం!

అధికారుల తీరువల్లే భర్త చనిపోయాడని భార్య ఫిర్యాదు



డ్రెయిన్ నుంచి తీస్తున్న కారు..వెంకటేశ్వరరావు(ఫైల్)

ముదినేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పామర్రు - దిగమర్రు వద్ద జాతీయ రహదారిలో ముదినేపల్లి సమీపంలోని పోల్‌రాజ్ మేజర్ డ్రైన్ వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు విస్తరణకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఏళ్ల తరబడి జాప్యం జరుగుతూనే ఉంది. డ్రైన్‌కు ఇరువైపులా రోడ్డును విస్తరించారే కానీ, డ్రైన్‌పై వంతెన నిర్మాణం జరగకపోవటంతో వాహనాలు సరాసరి డ్రైన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. రాత్రుళ్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రిటైర్డ్ ఎన్ఆర్ఎస్ఏ సైంటిస్ట్ లింగాలకు చెందిన చందు వెంకటేశ్వరరావు కుటుంబం వస్తున్న కారు సరాసరి డ్రైన్‌లోకి దూసుకుపోవడంతో ఆయన దుర్మరణం పాలయ్యారు. హైద రాబాద్‌లోనే నివాసం ఉంటున్న ఆయనకు ఆ వంతెన వద్ద ఉన్న పరిస్థితి తెలియక విస్తరించిన రోడ్డుపై రావడంతో కారును ఆపే అవ కాశం లేక డ్రైన్‌లో పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. దీంతో వెంటనే ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు రోడ్డు విస్తరణ జరిగిన ప్రాంతంలో సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. అధికారులు ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనందునే తన భర్త ప్రాణాలు కోల్పోయారని వెంకటేశ్వరరావు సతీమణి రాణి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్





సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్, హాజరైన పోలీసులు

ఏలూరుక్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బుధవారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంబంధిత అధికారులు సామాజిక కార్యకర్తలు, సంఘం స్థాయి సభ్యులతో అవగాహన సదస్సును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ బుధవారం నిర్వహించడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలియజేశారు. సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా సమాజంలో ఒక సవాల్‌గా మారిందని ఇది ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఒక వ్యవస్థీకృత నేరం అని దీనిని సమాజం సమిష్టి కృషితో నిరోధించాలని సూచించారు. ఈ మావన అక్రమ రవాణా ముఖ్యంగా సామాజిక అసమానతలు, ఆర్థిక పరిస్థితులు, డిజిటల్ అంశాలపై ముడిపడి ఉందని తెలిపారు. సమాజంలో అట్టడుగు స్థాయి వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ మానవ అక్రమ రవాణా జరుగుతోందని, తద్వారా శ్రమ, లైంగిక దోపిడీ జరుగుతుందన్నారు. పోలీసు విభాగాలు సరిహద్దు భద్రత, అంతర్జాతీయ సంస్థలు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌లు చట్టాలు అమలు, ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌లను ఉపయోగించడం, రవాణా కేంద్రాలు, అధిక రద్దీ ఉన్న ప్రాంతాలలో రక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలను చైతన్య వంతులను చేయడం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం అవసరమన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్లు కె సుబ్బారావు, ఎస్.కె.హుసేన్,దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాయక్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద, ఉమ్మడి జిల్లాల టీసీపీఓలు సిహెచ్ సూర్యచక్రవేణి, ఆర్.రాజేష్, ప్యానల్ న్యాయవాది రత్నరాజు, సీడబ్ల్యూసీ మెంబరు పి.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పివిఎన్ మునేశ్వరరావు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మణికంఠ మృతదేహం

మండవల్లి జూలై 30(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లింగాల గ్రామంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండికి చెందిన మత్తె మణికంఠ(21) తాతయ్యకు అనారోగ్యంగా ఉందని మోటారు సైకిల్‌పై ఉయ్యూరు బయల్దేరాడు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో లింగాల వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

భీమవరం క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి):భీమవరం ఏరియా ప్రభు త్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్టు వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 26న భీమవరం బస్టాండ్ వద్ద వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోగా ఆర్టీసీ నిర్వాహకులు 108లో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 30న బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం ఉంటే 94407 96632, 94407 96633 సెల్ నంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి

పెదపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి):వసంతవాడ గ్రామానికి చెందిన పొలగాని శ్రీనివాసరావు(60) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పెదపాడు పోలీసులు తెలిపారు. పొలగాని శ్రీనివాసరావు ఐదేళ్లుగా ఆస్తమా, ఇతర అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నాడు. అనారోగ్య సమస్యలు తాళలేక ఈ నెల 26న గడ్డిమందు తాగాడు. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 29న మృతి చెందాడు. దీనిపై శ్రీనివాసరావు కూమార్తె అద్దంకి నాగ మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కె.శారదాసతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి



భాస్కరరావు (ఫైల్)

ముసునూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముత్తంశెట్టి భాస్కరరావు(65) మంగళవారం ఉదయం పొలంలో పశువులను కాస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చుట్టు పక్కల ఉన్న పశువుల కాపరులు అతనిని ఇంటికి తీసుకెళ్లగా, కుటుంబీకులు గ్రా మంలో నాటు వైద్యం చేయించారు. రాత్రి వరకు బాగానే ఉన్న భాస్కరరావు ఆరోగ్య పరిస్థితి బుధవారం ఉదయం విషమించడంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఇద్దరికి జైలు

ఏలూరు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన ఇద్దరిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష, మూడే వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి కె.వాణిశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరులోని ఒక బాలిక 2019 ఫిబ్రవరి 13న స్కూల్ అయిపోయిన తరువాత తన ఇంటికి వెళ్లేందుకు స్కూలు బయట నిలబడి ఉంది. ఏలూరు ఎన్ఆర్ పేటనకు చెందిన కాళిదాసు సాయికుమార్(23), ఏలూరు పత్తేబాదనకు చెందిన తల్లూరి దాసు(19) ఆ బాలికకు సైగలు చేస్తూ వేధించారు. బాలిక జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి టూటౌన్ ఎస్ఐ కె.వెంకన్న కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితులైన కాళిదాసు సాయికుమార్, తల్లూరి దాసులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర శ్రీనివాస్ వాదించగా, ప్రాసిక్యూషన్‌కు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, టూటౌన్ సీఐ అశోక్ కుమార్, కోర్టు మోనటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా కానిస్టేబుల్ పద్మ, కానిస్టేబుల్ చిరంజీవులు సహకరించారు. నేరస్తులకు శిక్ష పడడంతో పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కెపిఎస్ కిషోర్ అభినందించారు.

శనివారపుపేట సొసైటీ అధ్యక్షుడిగా వంశీకృష్ణ

ఏలూరుటూటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ది శనివారపుపేట విశాల సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా కొనేరు వంశీకృష్ణ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే బడేటి చంటి కృష్ణవంశీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన కొనేరు వంశీకృష్ణను చైర్మన్ కావ డం వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులుగా సోమిశెట్టి రామ్మోహనరావు, కొనికి మహేశ్‌లు ప్రమాణస్వీకారం చేశారు.

నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించాలి

కుక్కునూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపందా మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎస్.కె.గౌస్ మాట్లాడుతూ లచ్చిగూడెం గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులను దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. నాయకులు స్వయం చంద్రరావు, మచ్చా ప్రసాద్, వీరబాబు, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన సముదాయం పరిశీలన

జంగారెడ్డిగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం కోర్టు భవన సముదాయాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించారు. కోర్టు భవన నిర్మాణానికి సహకరించాలని న్యాయవాదులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముందు మున్సిపల్ సాధారణ నిధులతో పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మతులను ఎమ్మెల్యే నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అధ్యక్షతన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యి మాట్లాడుతూ త్వరలోనే పట్టణ, మండల కమిటీలను ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సీనియర్ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ గ్రామ కమిటీల ఏర్పాటు

కామవరపుకోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో వైసీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసేందుకు జిల్లా శాఖ పరిశీలకులను నియమించినట్టు పార్టీ మండలాధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ బుధవారం తెలిపారు. తడికలపూడి, సాగిపాడు గ్రామాలకు దేవరపల్లి రామ్మోహన్‌రావు, తూర్పుయడవల్లికి డాక్టర్ కె.రామకృష్ణ, కె.ఎస్.రామవరం, కళ్ళచెరువులకు కేసరి సరిత భాస్కరరెడ్డి, వీరిశెట్టిగూడేనికి కనికళ్ళ రత్నకుమారి, రామన్నపాలెంకు తమ్మిశెట్టి గిరిజ, తాడిచర్లకు మెడంకి పద్మదేవి, ఉప్పలపాడుకు బొల్లు సత్యనారాయణ, గుంటుపల్లికి కె.అంజిరెడ్డి, పోలాసిగూడెంకు సాయుల స్వాతి, అంకాలంపాడుకు సాయన కనకరాజు, కామవరపుకోటకు కనమతరెడ్డి ప్రసాదరెడ్డి, ఆడమిల్లికి ఘంటా భాస్కరరావు, రావికంపాడుకు నల్లూరి ప్రభాకర్‌ను పరిశీలకులుగా నియమించినట్టు వివరించారు.

అంటువ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి శశాంక్ సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు జ్వరాలు, అంటు వ్యాధులపై అవగాహన సదస్సు, మానవహారం నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత హ్యాండ్‌వాష్ చేసుకోవాలన్నారు. స్కూలు హెచ్‌ఎం సునీత, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జనార్దనస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఏలూరుకార్పొరేషన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జనార్దనస్వామి ఆలయం వద్ద బుధవారం కల్యాణ మహోత్సవాన్ని అర్చక బృందం వంగల పవనకుమారాచార్యులు, వెంకటాచార్యుల బృందం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కల్యాణోత్సవాన్ని నగరానికి చెందిన కొల్లూరి లక్ష్మీనరసింహం, చెక్కా కిషోర్, మాటూరి హరీష్, మద్దుల వంశీకృష్ణ, కనమర్లపూడి రాజేష్ దంపతులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగబాబు, భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

మానవ అక్రమ రవాణా హేయం

ఏలూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోను, రైల్వేస్టేషన్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్పీఎఫ్ ఎస్ఐ బి.ధనుష్, ఏఎస్ఐ వి.వి.రత్నం, సూరినాయుడు, జీఆర్పీ ఫోర్స్ సీఐ వి.దుర్గారావు పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎవరిమీదైనా అనుమానం ఉంటే వెంటనే 1098, 1800-1027-222 హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలని క్రాఫ్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ కోరారు. జి.రాజలక్ష్మీ, చంద్రకళ, రేఖ, అమరావతి పాల్గొన్నారు.

● చింతలపూడి: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్క రూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు పిలుపునిచ్చారు. ప్రైవేటు జూనియర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవ సదస్సులో ఆయన మాట్లా డుతూ విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలని, ప్రేమ వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. సదస్సులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.క్రాంతి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మాణిక్యాల రావు, న్యాయవాదులు దుర్గాభవాని, అక్బర్ అలీ పాల్గొని మాట్లాడారు.

సేవకులను గుర్తించండి

ఉంగుటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా పోలీసులు సమాజంలో సేవాభావం ఉన్న వారిని గుర్తించి వివిధ రకాల సేవలను నిర్వహించేలా ప్రోత్సహించాలని ఎంపీడీవో రాజ్ మనోజ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా పోలీసులతో మమేకమై సమాజానికి ఉపయోగపడే వారిని గుర్తించాలని సూచించారు.

వీరభద్రపురంలో ఉపవాస పండుగలు

దెందులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వీరభద్రపురంలోని బెయేర్షెబా ప్రార్థనా మందిరంలో ఉపవాస పండుగను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. 30 రోజులుగా జరుగుతున్న ఉపవాస పండుగల కార్యక్రమంలో బ్రదర్ సాల్మన్‌రాజు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడికి ఇష్టమైన సక్రమ జీవనం సాగించాలన్నారు. అలాగే పెదవేగి మండలం జగన్నాథపురంలోని చర్చితో పాటు బెయేర్షెబా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో వృద్ధుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

తడికలపూడిలో పొలం పిలుస్తోంది



కామవరపుకోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ అధికారి ముత్యాలరావు, ఉద్యాన శాఖ అధికారి రత్న మాలల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తడికలపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతీ రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులను అతిగా వాడొద్దని రైతులకు సూచించారు.

లెక్కలేనితనం!

(5వ పేజీ తరువాయి)

అభయాంజనేయ స్వామి, ఆగిరిపల్లి శోభానాచలం, గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయం, ఏలూరు ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏదైన అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే అక్కడ ఈవోలు, సిబ్బంది వాటిని సరిచేసు కుని, సకాలంలో పత్రాలు సమర్పించుకుని సరి దిద్దుకుంటున్నట్టు తెలుస్తోంది. మిగతావారు మాకేమీ అవుతుందిలే, ఇది మాది కాదనంటూ వ్యవహరిస్తూ మొండిగా వ్యవహరిస్తున్నారు. దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిల్లోనే సమావేశాలు జరిగినప్పుడు ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలన్న దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారన్న విమర్శలు లేకపోలేదు.

రుణాలు..తూచ్!

(5వ పేజీ తరువాయి)

సోఫుల తయారీ, ఫిష్ ఫార్మింగ్, కార్‌వాష్ సర్వీస్ సెంటర్, బేకరీ షాపు తదితర 26 రకాల యూనిట్లు స్థాపించుకోవచ్చు. రూ.10 లక్షలకు పైగా యూనిట్లు స్థాపించుకునేవారికి 40 శాతం సబ్సిడీ, బ్యాంకు రుణాలు 55 శాతం, లబ్ధిదారుడి వాటా 5శాతం. ఈ విభాగంలో ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్లు స్థాపించుకోవచ్చు. పాసింజర్ ఆటోలు, పాసింజర్ కార్లు, గూడ్స్ ట్రక్కులు, వ్యవసాయ విభాగంలో డ్రోన్లు అందిస్తారు. మొత్తం రూ.10లక్షలు రుణాలుగా అందిస్తారు.

మెరుగులు దిద్దేందుకే నిలుపుదల: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు త్వరలోనే అందిస్తాం. ఉన్న పథకానికి ఇంకా మెరుగులు దిద్దేందుకే ప్రభుత్వం తాత్కాలికంగా ఈ పథకాన్ని నిలుపుదల చేసింది. కొత్తతరం యూనిట్లు స్థాపించుకోవడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇంకా రుణసదుపాయం పెంచడానికి కొత్తయూనిట్ల రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.



మరమ్మతులు చేయిస్తున్న హైవే అధికారులు

ప్రమాదాల నివారణకు హైవేపై మరమ్మతులు

ఏలూరు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కలపర్రు నుంచి గుండుగొలను వరకూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమదాల నివారణకు ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాలతో ప్రత్యేక మరమ్మతులు చేపట్టారు. కలపర్రు నుంచి గుండుగొలను వరకూ 10వ నెంబర్ జాతీయ రహదారిపై అక్కడక్కడ గోతులు, ఎగుడుదిగుడు ఉండడంలో ప్రమదాలు జరుగుతున్నాయి. దీంతో ఎస్పీ నేషనల్ హైవే కాంట్రాక్టర్ వరాహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్డు మరమ్మతులు నిర్వహించడానికి రూ.కోటి 20 లక్షలు మంజూరు చేసింది. రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలోని రైల్వే వంతెన వద్ద, చింతలపూడి బ్రిడ్జి, దుగ్గిరాల బ్రిడ్జి, దెందులూరు - కొవ్వలి వంతెన మధ్యలో సత్యనారాయణపురం వంతెన వద్ద ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నట్లు గుర్తించారు. రోడ్డు సరిగా లేకపోవడం, ఎత్తుపల్లాలు, గోతులు, ఉండడంతో వాటిని తక్షణమే మరామత్తులు చేయించాలని ఎస్పీ ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

రోడ్లు అంతంతమాత్రమే.. ఆపై దమ్ము ట్రాక్టర్లు..



పోలవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారులపై దమ్ము ట్రాక్టర్లు బుధవారం యథేచ్ఛగా తిరుగుతూ అంతంత మాత్రంగా ఉన్న రోడ్లను మరింత ఛిద్రం చేస్తున్నాయి. పోలవరం నుంచి గుంజవరం, రేపల్లెవాడ వెళ్లే రోడ్డు, గూటాల, పోల వరం గ్రామాల నుంచి కన్నాపురం అడ్డరోడ్డు వరకు, నూతనగూడెం, కృష్ణారావుపేట, బంగారమ్మపేట పంట పొలాలకు వెళ్లే రోడ్లు, కన్నాపురం అడ్డరోడ్డు నుంచి రేపల్లెవాడ వరకు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పంట పొలాల్లో దమ్ము చేస్తున్న ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో రోడ్డుపై నడుపుతున్నారు. అధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్ల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

5న ఆందోళనలకు నాయకులు సిద్ధం



కామవరపుకోటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

టి.నర్సాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని వైసీపీ యువనేత పెండ్యాల అభిషేక్‌బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని బుధవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. అదాని లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడం కోసం ప్రజల సొమ్మును కంపెనీకి దోచిపెట్టడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గ్రహించి వ్యతిరేకించాలన్నారు.

● చింతలపూడి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజావేదిక డిమాండ్ చేసింది. బుధవారం మండలంలోని యర్రగుంటపల్లిలో వామపక్షాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, రంగనాథ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల చాలా అనర్థాలు ఉన్నాయని, అందుకే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సంతకాల సేకరణలో డి.సత్యనారాయణ, టి.బాబు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చెయ్యాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. విద్యుత్ పంపిణీని ప్రైవేటు కంపెనీలకు కట్టిబెట్టినట్టు ఆరోపించారు.. నాయకులు ఇ.భూషణం, కారం దారయ్య, తగరం బాబూరావు, టి.దుర్గారావు, సీహెచ్.సీతారామయ్య ఉన్నారు.

● కామవరపుకోట: కామవరపుకోట సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా చౌతన సెంటర్‌లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ మండల కన్వీనర్ టి.వి.ఎస్.రాజు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఐ నాయకులు జి.సత్యనారాయణ, చలమాల శ్రీనివాసరావు,కె.వెంకటేశ్వరరావు, నల్లమోతుల అప్పన్న, బాలిన రమణారావు, పర్సా శ్రీను, అడపా సత్యనారాయణ, పి.సత్యనారాయణ, డి.నారాయణ పాల్గొన్నారు.

● కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపందా ఆధ్వర్యంలో బుధవారం కుక్కునూరులో సంతకాల సేకరణ చేపట్టారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ఈ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. స్వయం చంద్రరావు, ఎస్.కె. మున్ని, మడకం శంకరరావు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద భద్రతపై సీఐ దిశానిర్దేశం



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర్

పెదవేగి,జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ బ్యాంకు, ఏటీఎం సెంటర్ వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులను బ్యాంకు బ్రాంచ్‌లు నియమించుకోవాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ సూచించారు. పెదపాడు, పెదవేగి, దెందులూరు స్టేషన్ల పరిధిలో బ్యాంకు అధికారులకు బుధవారం భద్రతపై అవగాహన కల్పించారు. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి ఫుటేజ్ కనీసం 30 రోజుల పాటు భద్రంగా నిల్వఉంచాలని సూచించారు. సిబ్బందికి, కస్టమర్లకు సైబర్‌మోసాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంకు నిర్వాహకులపై ఉందని సీఐ వివరించారు.



నోట్ పుస్తకాలు అందుకున్న చిన్నారులతో దాతలు

నోట్ పుస్తకాల పంపిణీ

దెందులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యావ్యాప్తికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ట్రెస్ ఇండియా సంస్థ కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో అన్నారు. బుధవారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో సంస్థ తరఫున హెచ్‌ఎం కిరణ్మయి, మండల విద్యాశాఖ అధికారి నర్సింహమూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ట్రెస్ ఇండియా, టుగెదర్ ఇండియా సంస్థల తరపున వీటిని అందజేస్తున్నట్టు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి రూ.3 కోట్ల కేటాయింపు

»» కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

జంగారెడ్డిగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి చైర్ పర్సన్ కంచర్ల వాసవీరత్నం అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఏ వార్డులో అపారిశుధ్యం కనిపించినా తన నెంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో అన్ని శాఖల కంటే విద్యుత్ శాఖ పనితీరు బాగుందని అభినందించారు. గంగానమ్మ గుడి నుంచి ఏలూరు రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బి నుంచి రూ.1.92 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే రహదారిని జాతీయ రహదారిగా అభివద్ధి చేయాలని కోరుతూ కౌన్సిలర్లు ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కమిషనర్ కె.వి.రమణ, కౌన్సిలర్లు, తహసీల్దార్ కె.స్లీవజోజి, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి డీఈఈ సుబ్బారావు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యకు త్వరలో పరిష్కారం

నిడమర్రు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కొల్లేరు తీర ప్రాంత కాంటూరు సమస్యకు త్వరలోనే సానుకూల పరిష్కారం లభించనుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నిడమర్రు మండలం తోకలపల్లి, భైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాల్లో పల్లెపల్లెకు మన పత్సమట్ల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు వంటి సమస్యలపై దృష్టిపెట్టామన్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వాసురాజు, చింతలపాటి బాసిరాజు, సర్పంచ్‌లు ఓగిరాల ప్రభాకరరావు, ఎన్.దొరబాబు, వి.రఘు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నర్సాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడనుందని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ యూ.సుబ్బారావు తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఉత్కంఠభరితంగా ఎస్‌పీఎల్ ఎన్నికలు



ఓటు వేస్తున్న విద్యార్థినులు

ఏలూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమాజంలో జరిగే ప్రతీ విషయంపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నట్టు ఏలూరు మండలంలోని రామనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రోజులిన్ పేర్కొన్నారు. ఆ పాఠశాల ప్రాంగణంలో ఎస్‌పిఎల్, ఏఎస్‌పిఎల్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించేలా జరిగింది. విద్యార్థులు క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్‌పిఎల్‌గా ఎన్.డింపుల్ రమ్య, ఏఎస్‌పిఎల్‌గా కె.ధరణి ఎన్నికయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏవిధంగా పోటీ, కౌంటింగ్ జరుగుతుందో అదే తరహాలో ఈ ఎన్నికలు నిర్వహించడం విశేషం. ఎన్నికల అధికారిగా సిరిమామిళ్ల సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.శ్యామ్యూల్ బాల భాస్కర్, సుగుణ శివాజీ పాల్గొన్నారు.



ప్రచారపత్రాలు పంపిణీ చేస్తున్న చింతమనేని

ఇంటింటికీ సుపరిపాలన

పెదపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. జయపురం, పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతమనేని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల కరపత్రాలను అందజేశారు. మోరు శ్రావణి, మరడాని రవికుమార్, గుత్తా అనిల్, కలిపిండి అప్పారావు, లావేటి శ్రీనివాసరావు, అక్కినేని వంశీకృష్ణ పాల్గొన్నారు.

వేగవరం కాలనీకి రోడ్డు మంజూరు

దెందులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపన్నపాలెం(వేగవరం)లో ఇచ్చిన స్థలాలకు సరైన దారిలేకపోవడంతో విషయం తెలుసుకుని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రూ.కోటి రూపాయలు మంజూరు చేయించారు. కాలనీకి వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం సంస్థల వికార జనరల్ పాదర్ బాల, మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌లతో కలిసి కాలనీని పరిశీలించారు. కాలనీ రోడ్లకు ఉచితంగా స్థలం అందించిన పాదర్ రెవ బాల, సిస్టర్‌లను చింతమనేని అభినందించారు. అనంతరం రోడ్డు పనులను తహసీల్దార్ సుమతి, అధికారులతో కలిసి చింతమనేని పరిశీలించారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

పోలవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్థానిక కార్మెల్ పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు హెల్త్‌కార్డులు రికార్డు చేయనున్న నేపథ్యంలో విద్యార్థుల వివరాలు సేకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు అప్పారావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఐటీడీఏ ఉద్యోగికి సన్మానం

బుట్టాయగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో కష్టపడి పనిచేసే ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని కె.ఆర్.పురం ఐటీడీఏ మేనేజర్ ప్రకాశ్ అన్నారు. బుధవారం కె.ఆర్.పురం గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పార్వతీశ్వరరావు మాట్లాడుతూ సహోద్యోగులు గిరిజనులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నిజాయితీగా పనిచేస్తే ప్రజల గుండెల్లో చోటు సంపాదించవచ్చని అన్నారు. జీసీసీ మేనేజర్లు సి.హెచ్. రాజయోగి, డి.బాబూరావు పాల్గొన్నారు.



సంఘీభావం తెలియజేస్తున్న సంఘ నాయకులు

ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి

బుట్టాయగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని 9న ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మండల కేంద్రంలో జరపాలని గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుధవారం ప్రజా సంఘాలు, గిరిజన సంఘాల సమావేశం జరిగింది. మండల కేంద్రంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ పాస్టర్స్ అసోసియేషన్, గిరిజన జ్యోతి, సర్పంచ్‌లు ఫిలిప్, శేఖర్‌బాబు, కోరం సత్యన్నారాయణ దొర, పి.నాగేశ్వరరావు, భీమరాజు, శ్రీదేవి, కోర్స జలపాలు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలకుడిగా రాజ్‌కుమార్



ఏలూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏలూరు గ్రామీణ, నగర పాఠశాలల పరిశీలకుడిగా దూబచర్ల, ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ, లెక్చరర్ కె.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. జాతీయ, జిల్లా స్థాయి శిక్షకుడిగా, ఉపాధ్యాయుల కోసం ఎస్‌సీఈఆర్‌టీ కరదీపికల రచయితగా జిల్లాలో 10వ తరగతి ప్రత్యేక అధ్యాయన పుస్తకాల రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఆయను, ఏలూరు మండల ఎంఈవోలు, రవిప్రకాశ్, అరుణ్ కుమార్ హెచ్‌ఎంల సంఘ నాయకులు, ప్రకాష్‌లు అభినందించారు.

ఎస్.ఐ.గా క్రాంతి కుమార్



క్రాంతి కుమార్

జీలుగుమిల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి ఎస్.ఐ. వాసం క్రాంతికుమార్ బుధవారం బాధ్యతలు చేప ట్టారు. గతంలో తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో పని చేసిన అనుభవం ఉందన్నా రు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామని, అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించమన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

జీలుగుమిల్లి,జూలై 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ల సంక్షేమం కోసం తన వంతు కృషి చెస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గ పాస్టర్ల జేఏసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.ఎజ్రాశాస్త్రి కలిశారు. పాస్టర్లు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు ఆయనకు వివరించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలపై చర్చించి పాస్టర్లకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న పద్మశ్రీ

ఇద్దరికి ఏఓలుగా పదోన్నతి

ఏలూరుసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయం పరిధిలో ఎగువ శ్రేణి సహాయకులు(సీనియర్ అసిస్టెంట్లు)గా పనిచేస్తున్న ఇద్దరికి ఏఓలుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం ఏలూరు జడ్పీ క్యాంపు కార్యాలయంలో సేవలందిస్తున్న సీనియర్ అసిస్టెంట్లు సి.హెచ్. ఎ.పద్మజ(యలమంచిలి, ఎంపీపీ కార్యాలయం), జి.నాగేశ్వరరావు(కాళ్ళ, ఎంపీపీ కార్యాలయం)లకు ఏవోలుగా పదోన్నతులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. జడ్పీ ఏవో ఐ.వి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో పోయిన ఫోన్ అప్పగింత

ఏలూరు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఫోన్ పోయిందని ఫిర్యాదు చేసిన 15 నిమిషాల వ్యవధిలోనే పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. జంగారెడ్డిగూడేనికి చెందిన రాజా పద్మ ఏలూరుకు వచ్చి దంత వైద్యశాలకు ఆటోలో వెళ్తూ సెల్ ఫోన్ ఆటోలో మర్చిపోయింది. దీంతో ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆ ఫోన్ లొకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకుని తిరిగి బాధితురాలికి అందజేశారు.

విద్యార్థిపై యువకుడి దాడి

జంగారెడ్డిగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిన్నా అనే యువకుడు జడ్పీ బాలుర హైస్కూల్లో చదువుతున్న ఓ విద్యార్థిపై బుధవారం దాడి చేసి గాయపర్చాడు. పాఠశాల హెచ్‌ఎం సోమశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే పాఠశాలలో చదువుతున్న బాలికను సదరు విద్యార్థి ఏడిపించడంతో చిన్నా అనే యువకుడు పాఠశాలలోకి చొరబడి ఆ బాలుడిని కొట్టినట్టు హెచ్‌ఎం తెలిపారు. ఎస్.ఐ. జబీర్ పాఠశాలకు చేరుకుని ఆ యువకుడిని మందలించారు. ఇరువర్గాల పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

రోడ్డు అభివృద్ధికి నిధులు

ఏలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): లింగపాలెం నుంచి తువ్వ చిలుకరాయుడుపాలెం మీదుగా ధర్మాజీగూడెం వెళ్లే పీఆర్ రహదారిని రూ.నాలుగు కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. లింగపాలెం నుంచి టీసీహెచ్ఆర్ పాలెం మీదుగా కొణిజర్ల, ధర్మాజీగూడెం వెళ్లే పంచాయితీ రాజ్ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మరో వారం రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు.

స్వమిత్ర సర్వేపై శిక్షణ

జంగారెడ్డిగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 1 నుంచి జరగాల్సిన స్వమిత్ర సర్వే కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కె.ఆర్.ఎస్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీవో కొడాలి అనూరాధ హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో డిప్యూటీ ఎంపీడీవో వీఎన్‌వీవీ.సుజాత, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గోశాలకు తవుడు అందజేత

ద్వారకాతిరుమల, జూలై 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి గోసంరక్షణ శాలకు ఓ దాత బుధవారం మూడు టన్నుల తౌడును కానుకగా అందజేశారు. భీమవరానికి చెందిన రుద్రరాజు సతీశ్ ఈ విరాళాన్ని ఆలయ గోశాలకు అందజేశారు. దీని విలువ సుమారు రూ.1.15 లక్షలు అని దాత తెలిపారు. దీనిని గోపోషణకు వినియోగించాలని దాత సతీశ్ కోరారు.

ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడి ఎన్నిక

కుక్కునూరు,జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీ సెల్ కుక్కునూరు మండలా ధ్యక్షుడిగా చిలకా భానుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. భానుప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రేపటి నుంచి శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు

కైకలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కైకలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 1వ తేదీ నుంచి శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు టీటీడీ విశ్రాంత సమన్వయ అధికారి శ్రీకృష్ణకుమార శర్మ ప్రవచనకర్తగా వ్యవహరిస్తారన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

నానో యూరియా వాడండి

చాట్రాయి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల అధిక వాడకాన్ని తగ్గించి నానో యూరియా ఉపయోగించటం ఉత్తమమని ఏవో బి. శివశంకర్ సూచించారు. మండలంలోని మర్లపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులతో ఏవో మాట్లాడుతూ అధికంగా యూరియా వాడటం వల్ల తెగుళ్ళ ఉధృతి పెరగటమే కాక భూమి నిస్సారంగా మారుతుందన్నారు. పురుగు మందుల వాడకం కూడా తగ్గించి ప్రకృతిలో లభ్యమయ్యే వనరులతో వ్యవసాయం చేయాలని కోరారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం : డీఎస్పీ



కలిదిండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తే ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కలిదిండి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గంజాయి విక్రయించిన వారిపై నిఘా పెట్టామన్నారు. ఉప్పుటేరు తీర ప్రాంతాల్లో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠాను త్వరలో పట్టుకుంటామన్నారు. హుండీల్లో నగదు అపహరిస్తున్న కొంతమందిని పట్టుకుని నగదు రికవరీ చేశామన్నారు. కలిదిండి ప్రధాన సెంటర్‌లో ఆవుల బెడదతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని తమ దృష్టికి వచ్చిందని, వాటిని రహదారులపైకి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగులు, కోడి పందేలు, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహించి శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కైకలూరు సీఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి

జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా



ముసునూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం కాట్రేనిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నూజివీడు ఏడీఏ విద్యాసాగర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వరి పంటకు బీమా చేయించాలని, ఎకరానికి రూ.840లు చెల్లిస్తే నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.42,000లు పరిహారం పొందవచ్చన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం ఆగస్టు 2న ప్రభుత్వం అమలు చేయనుందని, అర్హులైన లబ్ధిదారులు జాబితాలో తమ పేరు నమోదు కాకపోతే రైతుసేవా కేంద్రాల అసిస్టెంట్లు ద్వారా గ్రీవెన్స్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులను పొంది ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఏవో ఎ.చాముండేశ్వరి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి : డీపీవో



నూజివీడు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతపై గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారిని అనూరాధ అన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో గల సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు స్వమిత్వ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో భౌగోళిక డేటా సేకరణ, మ్యాపింగ్ ఫీల్డ్ స్థాయి స్థిరీకరణ కోసం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సాఫ్ట్‌వేర్ వినియోగం, ఫీల్డ్ డేటా సేకరణ విధానాలపై శిక్షణ పొందారు. నూజివీడు డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి, నూజివీడు, ఆగిరిపల్లి ఎంపీడీవోలు చెన్ను రాఘవేంద్రనాథ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండల పరిషత్ అధికారులు స్వమిత్వ సర్వేపై బుధవారం ముదినేపల్లిలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాయాల డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు వివరించి శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని నివాస స్థలాల సర్వే, రికార్డుల్లో నమోదు, గ్రామ కంఠం భూముల్లో సంబంధిత అనుభవదార్లకు, నిరభ్యంతరకర ఇళ్ల నిర్మాణానికి అధికారిక పట్టాలు ఇవ్వటంపై డిప్యూటీ ఎంపీడీవో అశోక్ శిక్షణ ఇచ్చారు.

టీచర్ సాయి లక్ష్మి ప్రతిభకు ప్రశంస



ముదినేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన "సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్"లో ముదినేపల్లి మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.సాయిలక్ష్మి తన ప్రతిభను చూపారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా మంగళవారం రాత్రి ఆమెకు సీసీఆర్‌టీ డైరెక్టర్ రాహుల్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. ఏపీ నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొనగా, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సాయిలక్ష్మి ఒక్కరే ఈ శిక్షణలో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తదితర అంశాలపై 20 రోజులపాటు ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం అధికారులు నిర్వహించిన ప్రాజెక్టు వర్క్‌లో సాయిలక్ష్మి ప్రతిభ కనబర్చి ప్రశంసలు అందుకున్నారు.

ఎత్తిపోతల నీటిని సద్వినియోగం చేసుకోవాలి



కలిదిండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాల ద్వారా సరఫరా చేసే సాగునీరును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు అన్నారు. బుధవారం కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను రైతులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు గ్రామాలకు సాగునీటి కొరతను తీర్చటానికి ఎత్తిపోతల పథకాలను పునః ప్రారంభించామన్నారు. అడుగంటిన చేపల చెరువులను నింపుకోవాలన్నారు. నిరంతరాయంగా ఎత్తిపోతల ద్వారా సాగునీరును సరఫరా చేస్తామన్నారు.



వాలీబాల్ పోటీల్లో హీల్ విద్యార్థులకు ట్రోఫీ

ఆగిరిపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వాలీబాల్ పోటీల్లో హీల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ లతా చౌదరి తెలిపారు. హైద్రాబాద్ లోని మల్లారెడ్డి హైస్కూల్లో జరిగిన సీబీఎస్సీ క్లస్టర్ సెవెన్ అండర్ -14 వాలీబాల్ పోటీల్లో తెలంగాణ, ఏపీ నుంచి 1200 మంది పాల్గొనగా హీల్ విద్యార్థులు ట్రోఫీ సాధించారని తెలిపారు. హీల్ సీఈవో కురపాటి అజయ్ కుమార్, పీఈటీ నాగరాజు, శ్రీనివాసరావు, తదితరులు విద్యార్థులను అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



పోల్‌రాజ్ డ్రెయిన్ నుంచి కారు తీస్తున్న దృశ్యం.. పక్కన మృతుడు వెంకటేశ్వరరావు (ఫైల్)

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం!

- మంగళవారం నాడు డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయి మృతి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని ఎన్‌హెచ్ అధికారులు
- పోలీసులు స్పందించి బోర్డు ఏర్పాటు
- కేసు నమోదు



ముదినేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పామర్రు - దిగమర్రు నంబరు 165 జాతీయ రహదారిలో ముదినేపల్లి సమీపంలోని పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు విస్తరణకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఏళ్ల తరబడి జాప్యం జరుగుతూనే ఉంది. డ్రెయిన్‌కు ఇరువైపులా రోడ్డును విస్తరించారే కానీ, డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం జరగకపోవటంతో వాహనాలు సరాసరి డ్రెయిన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. రాత్రుళ్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కనీసం డ్రెన్‌కు కొద్ది దూరంలో పాత వంతెన వైపు వాహనాలను మళ్లించేందుకు రెండు వైపులా నేషనల్ హైవే అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాలు డ్రెన్ సమీపం వరకు వెళ్లి ప్రమాదపుటంచున ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రిటైర్డ్ ఎన్ఆర్ఎస్ఏ సైంటిస్ట్ లింగాలకు చెందిన చందు వెంకటేశ్వరరావు కుటుంబం వస్తున్న కారు సరాసరి డ్రెయిన్‌లోకి దూసుకుపోయి ఆయన దుర్మరణం పాలయ్యారు. హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్న ఆయనకు ఆ వంతెన వద్ద ఉన్న పరిస్థితి తెలియక విస్తరించిన రోడ్డుపై రావటంతో కారును ఆపే అవకాశం లేక డ్రెయిన్‌లో పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారుల అధికారులు వెంటనే విస్తరించిన రోడ్డు నుంచి కొద్ది దూరంలో ముందుగానే పాత రోడ్డుపైకి వాహనాలు వెళ్లే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

స్పందించిన పోలీసులు..

మంగళవారం రాత్రి పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయి రిటైర్డ్ సైంటిస్ట్ ప్రాణాలు కోల్పోయిన ఘటనతో స్పందించిన ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు రోడ్డు విస్తరణ జరిగిన ప్రాంతంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు.

కేసు నమోదు

అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనందునే తన భర్త ప్రాణాలు కోల్పోయారని వెంకటేశ్వరరావు సతీమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వరరావు మృతదేహానికి గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ వీరభద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోల్ రాజ్ డ్రెన్ వద్ద ప్రమాద స్థితి



ప్రమాదం అనంతరం పోలీసులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



భైరవపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

మండవల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): భైరవపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పార్టీ మండవల్లి మండల అధ్యక్షుడు మారగాని నాగేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేష్‌బాబు ఆధ్వర్యంలో బూత్ నంబర్ 18, 19, 20ల లోని 970 కుటుంబాల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాలు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఎంత కృషి చేస్తున్నారో వివరించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కూనపరెడ్డి కోటేశ్వరరావు గ్రామపార్టీ అధ్యక్షులు రుద్రరాజు శివకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి బోయిన గోపి కృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న దృశ్యం

అంబేడ్కర్-బాలయోగి భవన నిర్మాణానికి విరాళం

కైకలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కైకలూరులో అంబేడ్కర్-బాలయోగి భవన నిర్మాణానికి కామినేని రాంగోపాల్ రూ.50 వేలు విరాళం అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరులో ఈ నగదును ఎమ్మెల్యే కామినేని చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్-బాలయోగి భవన నిర్మాణానికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. మత్తే సూర్య చంద్రరావు, వీరాబత్తిన సుధా, జి. పాట్రిక్‌పాల్, జక్కుల విజయకుమార్, పళ్లెం తాతారావు, కంబాల వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కులను అందజేస్తున్న తపాలా శాఖ అధికారులు

తపాలా శాఖ బీమా చెక్కుల అందజేత

కైకలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ అందించే బీమా పాలసీలను ప్రజలు అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కైకలూరు తపాలా శాఖ కార్యాలయంలో బీమా చెక్కులను అందజేశారు. కలిదిండి గ్రామానికి చెందిన దండే విజయకుమార్ విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఆయన తపాలాశాఖలో రెండు పాలసీలు కట్టారు. ఈ బీమా పాలసీల ద్వారా రూ.15 లక్షలు, మరో పాలసీ ద్వారా రూ.5.35 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని చెక్కుల ద్వారా మృతుని కుటుంబీకులకు అందజేశారు. కైకలూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్‌కుమార్, సీనియర్ మేనేజర్ పి గణేష్, సబ్ పోస్టుమాస్టర్ కె ప్రభుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు నేడు తుది గడువు

కైకలూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శాంతిజ్యోతి తెలిపారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 178 మంది విద్యార్థులు చేరారని గత సంవత్సరంతో పోలిస్తే 35 అడ్మిషన్లు ఎక్కువ వచ్చాయన్నారు. అడ్మిషన్లు కావాల్సిన వారు గురువారం సాయంత్రం లోపు కళాశాలకు రావాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటుపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాలు అమలవుతాయని ప్రభుత్వ కళాశాలలో చేరి వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

యజమాని అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్

- విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి

భీమవరంటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధిక బిల్లులు వచ్చే ఇంటి యజమానులకు స్మార్ట్ మీటరు బిగించే విషయంలో సంబంధిత యజమాని అంగీకారం తీసుకుని ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. మంగళవారం రాత్రి భీమవరం వచ్చిన ఆయన విద్యుత్ శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో అధిక విద్యుత్ బిల్లులు వచ్చే వారు దాదాపు 25 వేల మంది ఉంటారని అధికారులు అంచనా వేశారు. వారికి స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయించారు. అయితే స్మార్ట్‌మీటర్లపై అపోహలు, ఆందోళనలు వస్తున్న నేపథ్యంలో యజమానులకు స్మార్ట్ మీటర్లపై పూర్తిస్థాయి లో అవగాహన కల్పించిన తరువాత వారి అంగీకారం తీసుకుని బిగించాలన్నారు. సూర్యఘర్‌పై ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చెయ్యాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు వారి ఇళ్లపై అద్దెకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సర్వే త్వరతగతిన పూర్తి చెయ్యాలన్నారు.

జిల్లాలో ఎక్కడా విద్యుత్ అంతరాయాలు రాకుండా వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్ అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా సబ్ స్టేషన్‌ల నిర్మాణాలపై ప్రతిపాదనలు ఉంటే వెంటనే అంచనాలు వేసి పంపించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. దీనిపై అధికారులు నరసాపురం పరిధిలో వేమలదీవి, అత్తిలి పరిధిలో మంచిలి, పాలకొల్లులో మేడపాడు, కాళ్ల పరిధిలో కానాలపల్లిలో ప్రతిపాదనలు ఉన్నాయని సంబంధిత ప్రజా ప్రతినిధులు పంపించారని వివరించారు.



యునైటెడ్ వే ప్రతినిధిని సత్కరిస్తున్న డైరెక్టర్

ముగిసిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్

నూజివీడు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగిసింది. యునైటెడ్ వే అనే సంస్థతో కలిసి కెరియర్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ సెల్ గత పదిరోజులుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ట్రిపుల్ ఐటీలో చివరి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లకు కావలసిన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆప్టిట్యూడ్ రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ చిరంజీవి, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి రుద్రం నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు శిక్షణ అందించిన యునైటెడ్‌వే సంస్థ ప్రతినిధి సౌమ్యను అమరేంద్రకుమార్ సత్కరించారు.

ముగిసిన ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్‌ల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మిగిలిన సీట్లకు భర్తీ చేసేందుకు మొత్తం 597 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించగా కౌన్సెలింగ్‌కు 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాక్ ఆడిటోరియంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో మొత్తం 123 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా వీరిలో బాలురు 38 మంది, బాలికలు 85 మంది ఉన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ తదితరులు పర్యవేక్షించారు.

ఎరువుల పంపిణీ

మండవల్లి జూలై 30(ఆంధ్రజ్యోతి): కానుకొల్లు సొసైటీ ద్వారా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. నకిలీ ఎరువులను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని వక్తలు పేర్కొన్నారు. సర్పంచ్ నాగదాసి, థామస్, మాజీ సర్పంచ్ గూడవల్లి కోటేశ్వరరావు, నీటి సంఘాల ఛైర్మన్ నాగేశ్వరరావు, పిచ్చయ్య, కానుకొల్లు సొసైటీ ఛైర్మన్ కోసూరి మాణిక్యాలరావు, డైరెక్టర్లు అక్కినేని సూర్యప్రసాద్, ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పత్రికను బహిష్కరించాలి

ముసునూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అసత్య కథనాలను ప్రచురిస్తున్న జగన్ పత్రికను తక్షణమే బహిష్కరించాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు డిమాండ్ చేశారు. మంత్రి పార్థసారథిపై ప్రచురితమైన తప్పుడు కథనంపై బుధవారం రమణక్కపేట మెయిన్ సెంటర్‌లో కూటమి నాయకులు నిరసన వ్యక్తం చేసి, జగన్ పత్రికను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, పరిశ్రమలను సైతం అడ్డుకునేందుకు వైసీపీ చేస్తున్న కుటిల యత్నాలని వారు మండిపడ్డారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి పార్థసారథి కృషి చేస్తుంటే ఆయనపై తప్పుడు కథనాలను ఇస్తున్న జగన్ పత్రికపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు ఆముదాల ఇసాక్, టీడీపీ నాయకులు ఉప్పే శివరామకృష్ణ, రంగు మల్లేశ్వరావు, ఆముదాల నోబుల్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మంత్రి పార్థసారథిపై దుష్ప్రచారం తగదని టీడీపీ సీనియర్ నాయకుడు మడుపల్లి గోపాల్ అన్నారు. ఆగిరిపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయోగ్యాస్ పరిశ్రమపై జగన్ పత్రిక వక్రీకరించి కథనాలు రాసి పైశాచిక ఆనందాన్ని పొందుతోందన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు (నరసయ్య) మాట్లాడుతూ తోటపల్లి వద్ద నిర్మించనున్న బయోగ్యాస్ ఉత్పత్తి పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయన్నారు. సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ విక్టర్, మాదల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



జగన్ పత్రికను దహనం చేస్తున్న దృశ్యం



నూజివీడులో మాట్లాడుతున్న జడ్జి అనూష



మండవల్లిలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మి

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డబ్బు ఆశ చూపి మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉండి నిఘా వర్గాలకు సమాచారం అందించాలని నూజివీడు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అనూష అన్నారు. నూజివీడు సిద్ధార్థ బి.ఫార్మసీ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం పురస్కరించుకుని విద్యార్థులకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ స్నేహపూర్వకంగా మెలుగుతూనే యువత, మహిళలను వ్యసనాలకు బానిసలు చేస్తూ మాయమాటలతో మానవ అక్రమ రవాణాకు మాఫియా ప్రయత్నిస్తుందన్నారు. దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాదులు ఎస్‌కేడి ప్రసాద్, గోపీనాథ్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మండవల్లి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వాటిని అరికట్టేందుకు అధికార యంత్రాంగానికి సహకరించాలని కైకలూరు కోర్టు న్యాయమూర్తి వీవీఎస్‌వీ లక్ష్మీ పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, న్యాయమూర్తి లక్ష్మి మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధానాలు, నివారణ, అరికట్టే చర్యలు, యువత చేపట్టవలసిన మార్గదర్శకాలపై ఆమె వివరించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం ఆరోగ్యకరం

ముసునూరు: చెక్కపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలపై ముసునూరు పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐలు నాగభూషణరావు, బేగ్ మాట్లాడుతూ ఈ డ్రగ్స్ వల్ల ఆరోగ్య సమస్యలతోపాటు కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా, మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదక రమైనవి, వీటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శివ నాగమణి, స్టాఫ్ సెక్రటరీ పద్మకిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు..తూచ్!

(5వ పేజీ తరువాయి)

సోపుల తయారీ, ఫిష్ ఫార్మింగ్, కార్‌వాష్ సర్వీస్ సెంటర్, బేకరీ షాపు తదితర 26 రకాల యూనిట్లు స్థాపించుకోవచ్చు. రూ.10 లక్షలకు పైగా యూనిట్లు స్థాపించుకునేవారికి 40 శాతం సబ్సిడీ, బ్యాంకు రుణాలు 55 శాతం, లబ్ధిదారుడి వాటా 5శాతం. ఈ విభాగంలో ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్లు స్థాపించుకోవచ్చు. పాసింజర్ ఆటోలు, పాసింజర్ కార్లు, గూడ్స్ ట్రక్కులు, వ్యవసాయ విభాగంలో డ్రోన్లు అందిస్తారు. మొత్తం రూ.10లక్షలు రుణాలుగా అందిస్తారు.

మెరుగులు దిద్దేందుకే నిలుపుదల

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు త్వరలోనే అందిస్తాం. ఉన్న పథకానికి ఇంకా మెరుగులు దిద్దేందుకే ప్రభుత్వం తాత్కాలికంగా ఈ పథకాన్ని నిలుపుదల చేసింది. కొత్తతరం యూనిట్లు స్థాపించుకోవడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇంకా రుణసదుపాయం పెంచడానికి కొత్తయూనిట్ల రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.

లెక్కలేనితనం!

(5వ పేజీ తరువాయి)

అభయాంజనేయ స్వామి, ఆగిరిపల్లి శోభానాచలం, గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయం, ఏలూరు ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏదైన అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే అక్కడ ఈవోలు, సిబ్బంది వాటిని సరిచేసు కుని, సకాలంలో పత్రాలు సమర్పించుకుని సరి దిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. మిగతావారు మాకేమీ అవుతుందీలే, ఇది మాది కాదనంటూ వ్యవహరిస్తూ మొండిగా వ్యవహరిస్తున్నారు. దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిల్లోనే సమావేశాలు జరిగినప్పుడు ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలన్న దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారన్న విమర్శలు లేకపోలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మండవల్లి జూలై 30(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లింగాల గ్రామంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన మత్తె మణికంఠ (21) తాతయ్యకు అనారోగ్యంగా ఉందని మోటారు సైకిల్‌పై ఉయ్యూరు బయలుదేరాడు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో లింగాల వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో ఒకరి మృతి

ముసునూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముత్తంశెట్టి భాస్కరరావు (65) మంగళవారం ఉదయం పొలంలో పశువులను కాస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చుట్టు పక్కల ఉన్న పశువుల కాపరులు అతనిని ఇంటికి తీసుకుని వెళ్ళగా, కుటుంబీకులు గ్రామంలో నాటు వైద్యం చేయించారు. రాత్రి వరకు బాగానే ఉన్న భాస్కరరావు ఆరోగ్య పరిస్థితి బుధవారం ఉదయం విషమించడంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కలిదిండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాళ్లపాలెంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను బుధవారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.4500ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే 94407 96435కు సమాచారం అందించాలని కోరారు.